



దీపం-2.. ఈ-కేవైసీ కష్టాలు

ఎప్పటి నుంచో పేదలను ఊరిస్తున్న ఉచిత సిలిండర్ పథకం లబ్ధిదారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా తమకు ఉచితంగా గ్యాసు సిలిండర్లు వస్తాయని భావించినవారిలో చాలా మందికి నిరాశ ఎదురవుతోంది. ఈ- కేవైసీ లేనికారణంగా కొంతమంది, రేషన్ కార్డు లేనందున కొంతమంది లబ్ధిదారులు ఉచిత సిలిండర్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

- ఈ కేవైసీ ఉన్నవారికే ఉచిత సిలిండర్లు
- ఈ కేవైసీపై అవగాహనా లేమితో లబ్ధిదారులకు నష్టం
- రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో మరింత మందికి కట్
- గత ప్రభుత్వ హయాంలో 25వేల దరఖాస్తులు పెండింగ్

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 19.5 లక్షల వంట గ్యాసు కనెక్షన్లు వున్నాయి. గుంటూరు జిల్లాలోనే 7 లక్షల కనెక్షన్లు వుండగా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 12.5 వేల గ్యాసు కనెక్షన్లు వున్నాయి. వీరందరికీ ఈ- కేవైసీ వుంటేనే ప్రస్తుతం ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తాయని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్‌పీజీలో గ్యాస్ కనెక్షన్ తీసు కున్న సమయంలో గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్‌ను లింక్ చేయాలి. ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతాతో గ్యాస్ కనెక్షన్‌ను అనుసంధానం చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను ఈ- కేవైసీ అంటారు. అయితే దీనిపై సగటు వినియో గదారులకు అవగాహన లేదు. ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో ఈ- కేవైసీ చేయించుకుని ఆ తరువాత దాన్ని మర్చిపో యారు. అయితే ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ-కేవైసీని ఆయిల్ సంస్థలు అప్‌డేట్ చేసు కుంటూ ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అవగా హన లేక ఈ కేవైసీని చాలా మంది నిర్లక్ష్యం చే శారు. ఈ కేవైసీ గ్యాసుపై సబ్సిడీ వస్తుంది. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ 15 రూపాయలకు పడిపోవ డంతో ఎవరూ ఈ కేవైసీ విషయాన్ని అంతగా పట్టించు కోలేదు. సబ్సిడీ పడుతుందో.. లేదో కూడా చూసుకోని పరి స్థితి ఏర్పడింది. దీంతో మూడు జిల్లాల్లో అనేకమందికి ఈ- కేవైసీ లేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై పౌర సరఫ రాల శాఖ అధికారులు, ఎల్పీజీ సంస్థలు, గ్యాసు ఏజెన్సీలు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

రేషన్ కార్డుల తంటా..

ఉచిత గ్యాస్ సిలిండర్లు అందివ్వడానికి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటోంది. అయితే మూడు జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి, కానీ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 17లక్షల రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. అంటే రెండున్నర లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వీరంతా ఈ పథకానికి అనర్హులు అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. గడిచిన ఐదేళ్లలో పెళ్లిళ్లు చేసుకుని కొత్త జీవితం ప్రారంభించిన దంపతులకు కొత్త రేషన్ కార్డులు ఇప్పటికీ రాని పరిస్థితి. కుటుంబాలు వేరైన తరువాత పాత రేషన్ కార్డులను విభజనకు దరఖాస్తు చేసుకున్నా వేర్వేరు కార్డులు రాలేదు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో లక్షా 60వేలు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 30వేల రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. దరఖాస్తు చేసుకోనివారు అంతకు మించిన సంఖ్యలో వున్నారు. ప్రస్తుతం వీరంతా ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. మొత్తంగా ఈ- కేవైసీ, రేషన్ కార్డుల వ్యవహారంతో మూడు జిల్లాల్లో 14 లక్షలకు మించి అర్హులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ప్ర భుత్వం ఈ సమస్యలను చక్కదిద్ది ఎక్కువమంది లబ్ధిదారులకు మేలు చేకూర్చేలా చర్య లు తీసుకోవాలని కోరుతున్నా రు.

ఈ- కేవైసీ ఇలా..

స్థానికంగా వున్న ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరూ ఈ- కేవైసీని చేయించుకోవచ్చు. కేవైసీ అప్‌డేట్ అయి వుంటే అవసరం లేదు.. లేని పక్షంలో బయోమెట్రిక్ పద్ధతిలోగానీ, ఆధార్ ఓటీపీ ద్వారాగానీ ఈ-కేవైసీ చేయించుకోవచ్చు.

- గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ కూడా ఈ కేవైసీ చేయవచ్చు. గ్యాస్ డెలివరీ బాయ్ ఇంటికి వచ్చిన సమయంలో అతడికి మన గ్యాస్ కనెక్షన్ వివరాలు చెబితే అతడు తన వద్దనున్న సంబంధిత గ్యాస్ (ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్) ఏజెన్సీల మొబైల్ యాప్‌లో ఆధార్ ఓటీపీ పద్ధతిలో ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.
- ఎవరికి వారుగా కూడా ఈ- కేవైసీ చేసుకోవచ్చు. ఆయా సంస్థకు సంబంధించి యాప్‌ను మొబైల్లో డౌన్లోడ్ చేసుకోవాలి. అందులో తొలుత రిజిస్టర్ అవ్వాలి. ఎగ్జిస్టింగ్ కస్టమర్ దగ్గర ఎస్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే రిజిస్ట్రేషన్ పేజీలోకి వెళుతుంది. అక్కడ ఎల్‌పీజీ ఎన్‌రోల్‌మెంట్ మొబైల్ నెంబర్ ఇచ్చి సబ్‌మిట్ చేయాలి. ఆ తరువాత పేజీలో పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్(ఆప్షనల్) ఇచ్చి రిజిస్టర్ కావాలి. దానికి సెక్యూరిటీగా నాలుగంకెల ఎం పిన్‌ను సెట్ చేసుకోవాలి. ఇలా రిజిస్టర్ అయిన తరువాత మొబైల్ నెంబర్, ఎంపిన్‌తో లాగిన్ అవ్వాలి. డాష్‌బోర్డు వస్తుంది. అందులో ఎల్‌పీజీ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తరువాత ఈ కేవైసీ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఈ- కేవైసీ గతంలోనే అయిపోయి వుంటే ఈ కేవైసీ సక్సెస్ ఫుల్ అని చూపిస్తుంది. పెండింగ్ ఉంటే క్యాప్చర్ ఫేస్ అనే ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేసి మొబైల్ ఫోన్‌ను ముఖానికి దగ్గరగా తీసుకుని వెళ్లి కళ్లు మూస్తూ, తెరుస్తూ వుండాలి. అప్పుడు అది ఫేస్ రికగ్నిషన్‌ను క్యాప్చర్ చేసుకుని ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తుంది. అనంతరం గ్యాస్ కనెక్షన్‌కు లింకైన బ్యాంకు ఖాతా యాక్టివేషన్‌ను కూడా అదే యాప్‌లో చూసుకుని తెలుసుకోవచ్చు. యాక్టివ్ అని వుంటే ఇబ్బందిలేదు.. అలా కాకుంటే బ్యాంకుకు వెళ్లి ఖాతాను యాక్టివేట్ చేయించుకోవాలి.

మున్సిపాలిటీలలో తాగు నీటి పథకాలపై విస్తరణకు నీలినీడలు తొలగిపోనున్నాయి. ఐదేళ్ల పాటు వైసీపీ సర్కార్ నిలిపివేసిన పనులు పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిధుల లేమితో ఎక్కడిక్కడే పనులు నిలిచిపోయాయి. నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకొని పథకాలకు మొండిచేయి చూపింది. ఫలితంగా ఐదేళ్లు తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పురాల పౌరులు ఇక్కట్లు పడుతున్నారు. నిలిచిపోయిన పథకాల పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నడుం కట్టింది. ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో పట్టణాల్లో నాడు తెలుగుదేశం ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాల విస్తరణ పనులు చేపట్టగా వీటిని పూర్తి చేయక వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.

- ఆగిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి
- ఏఐఐబీ నిధుల కేటాయింపు



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

తాగునీటి పథకాల విస్తరణకు నిధులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పోరేషన్‌తో సహా మంగళగిరి, తాడేపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో తాగు నీటి పథకాల విస్తరణకు ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐబీ) నిధులు మంజూరు చేసింది. ఈ మునిసిపాల్టీలో ఉన్న నీటి పథకాలను పూర్తి స్థాయిలో రానున్న 25 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి ఇందుకు అనుగుణంగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. గత ఐదేళ్లు ఎక్కడి పనులు అక్కడనే ఉన్నాయి. సదరు బ్యాంకు రుణం 70శాతం, 30శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. బ్యాంకు నుంచి విడుదలైన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు జమ అయ్యాయి. ఈ నిధులు విడుదలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా ధనం కూడా విడదల చేయాల్సిఉంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ధనం ఇవ్వకపోగా బ్యాంకు వి డుదల చేసిన నిధులను వినియోగించుకుంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాం ట్రాక్టర్లు నీటి పథకాల పనులు పూర్తిగా నిలిపివేశారు. ఏఐబీ నిధులతో అయా మునిసిపాల్టీలలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించి టెండర్లు నిర్వహించి పనులను చేపట్టింది. నీటినిల్వ, చెరువుల ఆధునీకీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటిశుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులను చేపట్టారు. ఈ పనులు ముందుకు సాగక పోవడంతో గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల మునిసిపాల్టీలలో తాగు నీటి సమస్యలను పౌరులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సరఫరా కూడా అరకొరగానే జరుగుతోంది. అయా పనులు పూర్తి చేస్తే పుష్కలంగా ప్రజలకు తాగునీరు అందుతుంది.

పల్నాడు జిల్లాలోని వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో సుమారు 295 కోట్లలో నీటి పథకాల పనులు చేపట్టారు. మాచర్ల మునిసిపాల్టీలో సుమారు రూ.55కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా 10శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్ళ మునిసిపాల్టీలో రూ.102 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఇక్కడ మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు 20శాతం కూడా పూర్తికాలేదు. వినుకొండలో రూ.138కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో సూమారు 68.10 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. వీటిలో రూ 34.45 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తయినట్టు కార్పొరేషన్ లెక్కలు తెలియజేస్తున్నాయి. మంగళగిరి, తాడేపల్లి మునిసిపాల్టీల పరిధిలో సూమరు రూ.102కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల్లో కేవలం రూ.92.56లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తిచేసినట్టు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. అయా పనులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పనులు నిర్వహణపై సమీక్షలు కూడా నిర్వహించారు. ఈ పనులు పూర్తిచేస్తే అయా పట్టణాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

నీటి పథకాల నిర్వహణలో నూతన విధానం

పట్టణాల్లో నీటి పథకాల నిర్వహణపై ప్రభుత్వం నూతన విధానం అమల్లోకి తీసుకురావాలని యోచిస్తుంది. ఈ మేరకు ఇతర రాష్ట్రాల్లో నీటి పథకాల నిర్వహణపై అధ్యయనం కూడా నిర్వహించింది. సదరు అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. తాగు నీటి పథకాలు నిర్మించిన కాంట్రాక్టరే 15 ఏళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్న అంశంపై మేధోమధనం చేస్తున్నారు. ఏదైనా మునిసిపాల్టీలో తాగునీటి పథకం విస్తరణ, నూతన పథకం నిర్మాణం టెండర్ పద్దతిలో చేపడుతున్నారు. పనులు పొందిన కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తున్నారు. లాభార్జనకు ప్రాధాన్యత ఇస్తున్న కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నారు. పనులు పూర్తి చేసి స్కీమ్‌ను మునిసిపాల్టీలకు అప్పగించి కాంట్రాక్టర్ బిల్లులు తీసుకుంటున్నాడు. నాసిరకంగా పనులు జరగడంతో స్కీమ్ రెండు మూడేళ్లలోనే మూలనపడుతోంది. ఇటువంటి సంఘటలను ప్రభుత్వం గుర్తించింది. స్కీమ్ పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కే 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించే విధానంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీని వలన పనులు నాణ్యతలో జరగడంతో పాటు వెచ్చించిన నిధులు నిరూపయోగంకాకుండా ఉండటంతో పాటు మంచి నీటి పథకాలు పూర్తి స్థాయిలో పనిచేస్తాయన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలిసింది. అయితే ఈ విధానం అమలుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ విధానం అమలు జరిగితే నీటి పథకాలు పూర్తిస్థాయిలో ప్రజా వినియోగంలో ఉండే అవకాశం ఉంటుం దని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

- పాఠశాల, ఆధార్ రికార్డుల్లో భారీ వ్యత్యాసం
- నిర్దేశిత సంఖ్యలో లేని ఆధార్ నమోదు కేంద్రాలు
- నమోదులో జిల్లా 22వ స్థానం

విద్యార్థులకు అపార్ కష్టాలు

గుంటూరు(విద్య), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు "వన్ నేషన్ వన్ కార్డ్" పేరుతో ప్రత్యేకంగా కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అపార్ (పర్మినెంట్ అక్కడ మీకు అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల్లో దాదాపు 7లక్షల మందికి, జూనియర్ కళాశాలలో 95వేల మందికి కార్డులు ఇవ్వాల్సిఉంది. అయితే నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వేగం పుంజుకోలేదు. ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కేంద్రం నుంచి ఆదేశాల ఉన్నా ఆ దిశగా జిల్లాలో నమోదు ప్రక్రియ సాగడంలేదనే ఆరోపణలొస్తున్నాయి.

ఆధార్ పాఠశాల రికార్డులకు పొంతనలేదు

విద్యార్థులకు సంబంధించి ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు, పాఠశాలలో ఉన్న రికార్డులకు పొంతన ఉండటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పుట్టిన తేదీ, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు వంటివి పాఠశాల రికార్డులకు, ఆధార్‌లో ఒకే విధంగా ఉంటేనే నమోదు జరుగుతుంది. ఆధార్‌లో ఉన్న రికార్డుల ప్రకారమే అపార్ కార్డులు జారీ అవుతాయి. అనేక మంది విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఆధార్‌లో సక్రమంగా లేవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే నిర్దేశించిన సంఖ్యలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఆధార్‌లో ఉన్న తప్పులు సరిచేసుకోవడం ఇబ్బందికరంగా మారిందనే వాదన ఉంది.

నాటి విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లా అపార్ నమోదులో 22వ స్థానంలో ఉంది. దీనికి ప్రధాన కారణం ఇప్పటిదాకా ఇక్కడ పనిచేసిన విద్యాశాఖ అధికారి కారణమని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాము ఎన్నిసార్లు ఆధార్ కేంద్రాలు పెంచాలని, క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు వివరించినా ఆమె పట్టించుకోలేదని చెబుతున్నారు.

అపార్‌తో అనేక ఉపయోగాలు...

ఆపార్ కార్డు వల్ల విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉంటాయి. విద్యార్థికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు డిజీ లాకర్లకు అనుసంధానమైపోతాయి. నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదు. ఉపకార వేతనాలు, క్రీడలు, కుల ఆదాయ, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థుల సమస్త వివరాలు ఇందులో నమోదవుతాయి. ఎప్పుడైనా ఇవి పొందడానికి వీలుంటుంది.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి
కె.బసవలింగారావు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అపార్(అటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో విద్యార్థుల వివరాలు నమోదు, తలెత్తే సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె బసవలింగారావు సూచించారు. ఇప్పటికే తాము డీఈవోకి వినతిపత్రం అందజేశామని తెలిపారు.

భర్త వివాహేతర సంబంధం.. భార్య ఆత్మహత్య

రేపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల గొడవల కారణంగా మండలంలోని పిరాట్లంక గ్రామానికి చెందిన తోట శివనాగులు(30) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తన భర్త వేరే అమ్మాయితే వివాహేతర సంబంధం పెట్టుకోవటంతో భార్యభర్తల మధ్య గత సంవత్సర కాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త తోట రాజేష్ వేరే అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకుని ఇంటికి తీసుకువస్తానని బెదిరించటంతో భార్య శివనాగులు ఓర్చుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. శివనాగులు తల్లి కనకలక్ష్మి ఫిర్యాదు చేయడంతో చోడాయపాలెం ఎస్ఐ జ్యోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివనాగులుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆర్టీసీ పంచారామాలకు అనూహ్య స్పందన

- తొలి రోజే నాలుగు సర్వీసులు
- 24 గంటల్లో దర్శించుకునేలా ఏర్పాట్లు



భక్తులతో పంచారామాల సర్వీసును ప్రారంభిస్తున్న గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంలో 24 గంటల్లో పంచారామాలను దర్శించుకునేలా ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన పంచారామాల సర్వీసులకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. తొలి రోజు శనివారం రాత్రి గుంటూరు-1, 2 డిపోల నుంచి రెండేసి చొప్పున నాలుగు సర్వీసులు ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఆదివారం రాత్రి గుంటూరు-2 డిపో నుంచి మరో మూడు సర్వీసులు బయల్దేరటం భక్తుల ఆదరణను తెలియజేస్తోంది. కార్తీక మాసంలో ప్రతి శని, ఆదివారం రాత్రి సమయాల్లో బస్టాండ్ నుంచి పంచారామాలైన సామర్లకోట, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, అమరావతి క్షేత్రాలకు 24 గంటల్లో అంటే రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి అదే సమయానికి తిరిగి బస్టాండ్‌కు చేరుకునేలా సర్వీసులను సిద్ధం చేశారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోలలో కూడా పంచారామాల సర్వీసులను సిద్ధం చేశారు. క్యూలైన్‌లలో త్వరితగతిన దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అలానే అయ్యప్పస్వాముల కోసం అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బస్సులను సిద్ధం చేశారు. అలాగే త్రిశైవ క్షేత్రాలైన శ్రీశైలం, యాగంటి, మహానంది క్షేత్రాలకు కూడా బస్సులను ఏర్పాటు చేశారు. శబరిమల యాత్రకు 6, 8, 12 రోజుల టూర్ ప్యాకేజీలను సిద్ధం చేసినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు.

పంచారామాల టిక్కెట్ ధరలు ఒక్కొక్కరికి..

బస్టాండ్	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్	సూపర్ లగ్జరీ	ఫోన్‌నెంబర్
గుంటూరు నుంచి	870	1110	1160	9959225420/21
తెనాలి నుంచి	960	1220	1270	9959225422
మంగళగిరి నుంచి	860	1090	1140	9959225424
పొన్నూరు నుంచి	950	1200	1250	9959225267

త్రి శైవక్షేత్రాల దర్శనం కోసం..

బస్టాండ్	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్	సూపర్ లగ్జరీ	డిపోమేనేజర్
గుంటూరు నుంచి	1080	1380	1440	9959225420/21
తెనాలి నుంచి	1160	1480	1540	9959225422
మంగళగిరి నుంచి	1140	1450	1510	9959225424
పొన్నూరు నుంచి	1160	1480	1540	9959225267

పకడ్బందీగా దూర విద్య పరీక్షలు

- దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు



తాడికొండ దూరవిద్య పరీక్షల కేంద్రంలో తనిఖీ చేస్తున్న డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

పెదకాకాని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న దూరవిద్య పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. గత నెల 27వ తేదీ నుంచి దూరవిద్య కేంద్రం పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా 114 కేంద్రాల్లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక పరిశీలకులను నియమించామన్నారు. స్క్వాడ్ బృందాలు, రీజనల్ కోఆర్డినేటర్‌ల ద్వారా పకడ్బందీగా, సజావుగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఆయా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే డైరెక్టర్‌గా తాను తాడికొండలోని బీఎస్ఎస్‌బీ కళాశాల, యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రబల లక్ష్మీ నారాయణ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలు, మౌలిక వసతులపై పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు ఆయన సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావు



ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుకు మద్దతు తెలియజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గుంటూరు (విద్య) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు పేరును ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్), యూటీఎఫ్ సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ మేరకు గుంటూరులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శాసనమండలి పునరుద్ధరించిన తరువాత ఎన్నికైన పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. 2007 నుంచి 2024 వరకు 13 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్, నిరుద్యోగ, రైతాంగ, మహిళా ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించారని వివరించారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించేలా ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల స్థానాలు ఉండాలని, అయితే రాజకీయ పార్టీలు ఆ లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అనేక ప్రజా సంఘాలు ప్రత్యేకంగా మద్దతు ఇవ్వడం హర్షణీయం అన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎం.హనుమంతరావు, కళాధర్ సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు వీవీకే సురేష్, ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ నాయకులు నర్రా శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు సాంబశివరావు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు స్వాతి, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు ముత్యాలరావు, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

గుంటూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని, అనవసరపు యాప్‌లతో విద్యాబోధనకు అడ్డంకులు సృష్టించరాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల రోడ్డులోని ఎన్జీవోహోమ్‌లో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ అధ్యక్షత వహించారు. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఆర్నెల్ల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయల్లో పేరుకుపోయాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డీఏలు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఐ.బి. కరిక్యులమ్, బైజూస్, టోఫెల్ ఆచరణలో విఫలమయ్యాయన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సబ్జెక్ట్ టీచర్స్ ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.పార్వతి, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఏవోగా ఆదినారాయణ నియామకం

గుంటూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖలో హాట్ టాపిక్‌గా మారిన విజిలెన్స్ వ్యవసాయాధికారి పోస్టు వ్యవహారానికి తెరపడింది. గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవోగా చల్లగుండ్ల ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు విజిలెన్స్ డీజీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ప్రకాశం జిల్లా యద్దనపూడి ఏవోగా పనిచేస్తున్న ఆదినారాయణ రెండేళ్ల పాటు డిప్యుటేషన్‌పై విజిలెన్స్‌లో కొనసాగే అవకాశం ఉంది.

టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించాలి

గుంటూరు(విద్య) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో గిరిజనులకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో హాతిరాంబాబాజీ భక్తులుగా ఖ్యాతి గడించిన గిరిజనులకు అవకాశం ఇవ్వాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు బోర్డులో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అవకాశం కల్పించకపోతే ఆందోళన చేస్తామని ప్రకటించారు.

డెలివరీ అయిన భార్యను చూసి వస్తూ మృతి

సత్తెనపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డెలివరీ అయిన భార్యను చూసి వస్తుండగా జరిగిన ప్రమాదంలో భర్త, అతని స్నేహితుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ పెద్దకాలువ వద్ద ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో క్రోసూరు మండలం 88 తాళ్ళూరుకు చెందిన రాయపూడి రోశయ్య(27), అతని స్నేహితుడైన కట్టా వీరేంద్ర(18) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధూళిపాళ్ల సమీపంలోని కోల్డ్ స్టోరేజ్‌లో రోశయ్య పని చేస్తుంటాడు. రోశయ్య భార్య యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో డెలివరీ కావటంతో ఆమెను చూసేందుకు తన స్నేహితుడు వీరేంద్రతో కలిసి వెళ్లాడు. చూసిన తరువాత ఇంట్లోకి ఫ్యాన్ అవసరం కావడంతో కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న ఫ్యాన్ తీసుకొచ్చేందుకు ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో వారు ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ పెద్దకాలువ వద్దకు రాగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరేంద్రకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆటో ఢీకొనటం వలన ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అనుమతి లేకుండా ర్యాలీ.. వైసీపీ నాయకులపై కేసు

గుంటూరు (కార్పొరేషన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా నగ రంలో ర్యాలీ నిర్వహించిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పాతగుంటూరు పోలీసులు తెలిపారు. వైసీపీ నగర అధ్యక్షుడిగా డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు పదవీ స్వీకార సభ సందర్భంగా శనివారం కాకాని రోడ్డులోని మంగళదాస్‌నగర్ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముందస్తు అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమేకాకుండా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే బావమరిది, అతని అనుచరులపై దాడి ఘటనపై కేసు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద‌ర్‌నగర్‌లో అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగేందుకు వెళ్లిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి బావమరిది రామకృష్ణారెడ్డి, ఆయన స్నేహితుడు మాదారావులపై దాడి చేసిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద‌ర్‌నగర్‌లో శనివారం రాత్రి డబ్బులు అడగడానికి వెళ్లిన రామకృష్ణారెడ్డి, మాధవరావులపై సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆయన కుమారుడు రిషి, మరి కొంత మంది యువకులు దాడి చేశారు. ఈ ఘటనపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో సుబ్రహ్మణ్యేశ్వరరావు, రిషితో పాటు మరికొందరిపై కేసు నమోదైంది.

కళాశాల అద్దాలు ధ్వంసం ఘటనపై కేసు నమోదు

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్ అయ్యప్ప స్వామి గుడి సమీపంలోని ఓ కార్పొరేట్ కళాశాలపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేట్ స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్న ఉండడాన్ని గమనించి ఏబీవీపీ రాష్ట్ర నాయకులు సాయి ఆధ్వర్యంలో ఏడుగురు స్కూల్లోకి దౌర్జన్యంగా వెళ్లి అద్దాలు ధ్వంసం చేసి ఫర్నిచర్ పగలగొట్టారు. స్కూల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు ప్రాధాన్యమివ్వండి

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో రజకులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలలో కులవృత్తిదారులకు కాంట్రాక్టులు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన రజకులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా రజకులను అన్ని విధాలా మోసం చేసిందని, అందుకే ఓటమి చవి చూసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వృత్తిదారులకు న్యాయం చేయాలని కోరారు.



అన్నమయ్య కళావేదికలో ఆదివారం ప్రదర్శించిన బ్రహ్మం గారి నాటకంలో ఓ సన్నివేశం

ఆకట్టుకున్న బ్రహ్మం గారి నాటకం

గుంటూరు(తూర్పు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై వీర బ్రహ్మేంద్ర స్వామి వారి భక్త బృందం ఆది వారం ప్రదర్శించిన బ్రహ్మం గారి నాటకం ఆకట్టుకుంది. సూరపనేని శ్రీకాంత్ సహకారంతో ఈ నాటకం ప్రదర్శించారు. అనంతరం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తాళపత్ర నిధి రూపంలో అందించిన వాటిలో కొన్ని ముఖ్యఘట్టాలను ఈ నాటక రూపంలో ప్రదర్శించారు. అనంతరం కళా కారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, సూరపనేని శ్రీరామచంద్ర మూర్తి చౌదరి పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై హత్యాయత్నం కేసులో

బార్ యజమాని సహా నలుగురు అరెస్ట్

- దీపావళి రోజు జరిగిన ఘటన
- పరారీలో మరో ఐదుగురు నిందితులు
- నిందితులందరిపై రౌడీషీట్లు తెరుస్తాం
- ఎస్పీ సతీష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ మల్లికార్జునరావు, వెనుక నిందితులు

గుంటూరు నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప వివాదంలో తన కుమారుడు, అనుచరులతో కలసి రెచ్చిపోయిన బార్ యజమాని, అతని అనుచరులు జైలు ఊచలు లెక్కించే పరిస్థితి తెచ్చుకున్నారు. గత నెల 31న దీపావళి పండుగ నాడు బాణాసంచా కాల్చే విషయంలో జరిగిన ఘర్షణలో ఓ దళిత కుటుంబంపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శకుంతలనగర్ రెండో లైన్‌కు చెందిన సెలబ్రేషన్స్ బార్ యజమాని కంకర నరేంద్రరెడ్డి, ఆయన కారు డ్రైవర్, పర్చూరుకు చెందిన వరగాని వెంకటేష్ అలియాస్ వెంకట్, అగతవరప్పాడులోని ఏపీఎస్ కాలనీకి చెందిన ఎల్లా సాయి ప్రకాష్, ఆరుదల శివయ్య ఉన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరచి వివ రాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు, దీపావళి పండుగ నాడ స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని శకుంతలనగర్ రెండో లైన్‌లోని జేసీ పారడైజ్- 2 అపార్టుమెంట్‌కు చెందిన గుడిబండ్ల సోనియా, ఆమె కుమారుడు అవినాష్‌లు అపార్టుమెంట్ సెల్లార్‌లో బాణసంచా కాలుస్తున్నారు. అక్కడకు అవినాష్ స్నేహితుడు జయదేవ్ కూడా వచ్చారు. కొంచెం సేపటి తర్వాత సోనియా తన ప్లాట్‌లోకి వెళ్లగా అవినాష్, జయదేవ్‌లు టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎదురు ఇంట్లో పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న వరగాని వెంకటేష్ ఈ విషయమై అవినాష్, జయదేవ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో అవినాష్‌ను వెంకటేష్ కులం పేరుతో దూషించి బెదిరించాడు. ఆ తర్వాత కూడా అవినాష్, జయదేవ్‌లు బాణసంచా కాలుస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేష్ నరేంద్రరెడ్డికి ఫోన్ చేయగా ఆయన అక్కడికి కారులో వచ్చి అవినాష్‌ను తొక్కించబోయాడు. ఆ తరువాత నరేంద్రరెడ్డితో పాటు ఆయన మామకు చెందిన ఓయో లాడ్జిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న యల్లా సాయిప్రకాష్, ఆయా రూముల్లో ఉండే ఆరుదల శివయ్యలు అవినాష్, జయదేవ్‌లపై దాడి చేశారు. దీంతో, అపార్టుమెంట్ పైకి వెళ్లిన జయదేవ్ జరిగిన విషయాన్ని అవినాష్ తల్లి సోనియాకు చెప్పాడు. కిందకు వచ్చిన ఆమె, అవినాష్‌ను తీసుకొని పైకి వెళ్ళింది. ఇంతలో అక్కడికి వచ్చిన నరేంద్రరెడ్డి కుమారుడు రుషికేశ్ రెడ్డి, మహేష్ అలియాస్ నక్కా డేవిడ్, రవితేజ, ఫయాజ్, వెంకట్, సాయి, శివ, షేక్ అనాస్, చిలకా రాము తదితరులు అందరూ కలిసి సోనియా ప్లాట్‌లోకి వెళ్లి సామ గ్రిని ధ్వంసం చేశారు. అవినాష్‌పై దాడి చేసిన వారు అతన్ని చంపేందుకు యత్ని స్తుండగా తల్లి సోనియా అడ్డుకుంది. ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దూషించారు. దీంతో, డయల్ '100'కు అవినాష్ ఫోన్ చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చే సరికి నిందితులు పరారయ్యారు. గాయపడిన సోనియాను, ఆమె కుమారుడు అవినాష్ ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితురాలు సోనియా ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం తో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. తొలుత అవినాష్‌పై దాడి చేసిన ఘ టనకు సంబంధించిన నిందితులు బార్ యజమాని కంకర నరేంద్రరెడ్డి, ఆయన డ్రైవర్ వరగాణి వెంకటేష్, ఎల్లా సాయి ప్రకాష్, ఆరుదల శివయ్యలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పున రావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తా టమని, దీనిలో భాగంగా కేసులో నిందితులందరిపై రౌడీ షీట్లు తెరుస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సౌత్ ఇన్‌ఛార్జి డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు సీఐ కే వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

120 గ్రామాలకు ఆర్టీసీ సేవలు

- ప్రజలు ఆదరిస్తేనే నష్టాల నుంచి గట్టెక్కేది
- గుంటూరు- 1 డిపో మేనేజర్ ఎమ్‌వీఎస్ రామకృష్ణ



గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పల్లె వెలుగు సర్వీసులతో గుంటూరు-1 డిపో పరిధిలో 120 గ్రామాల ప్రజలకు ప్రయాణ సేవలు అందిస్తున్నామని డిపో మేనేజర్ ఎమ్‌వీఎస్ రామకృష్ణ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే డిపోలో నష్టాల నుంచి బయట పడగలుగుతామన్నారు. డిపో పరిధిలో సమస్యలు, ప్రయాణికుల ఫిర్యాదులపై ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. డిపో పరిధిలో మొత్తం 109 సర్వీసులు ఉన్నట్లు చెప్పారు. హైదరా బాద్‌కు రెండు ఏసీ సర్వీసులతో పాటు బెంగళూరు, చెన్నై, భద్రాచలం వంటి దూర ప్రాంతాలకు కూడా సర్వీసులు నడుపుతున్నామన్నారు. డిపో రూ. 5 కోట్ల 88 లక్షలు నష్టాల్లో ఉందని, అయినప్పటికీ పల్లెవెలుగు సర్వీసులను ప్రయా ణికులకు అందుబాటులో ఉంచామని అన్నారు.

డిపో నష్టాల నుంచి అధిగమించకపోవడానికి కారణం...

ఫటా ఫట్

డీఎం: ముఖ్యంగా డిపో పరిధిలో ప్రయాణికులకు సౌకర్యాలకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. ఎ గ్రామీణప్రాంతాల ప్రయాణికులకు నష్టాలు వస్తున్నా బస్సులను నడపడంలో వెనుకాడకుండా అందుబాటులో ఉంచుతున్నాం.

చాలా గ్రామాల్లోకి ఆర్టీసీ సర్వీసు ఒక ట్రిప్పుపై ఫిర్యాదులు ఉన్నాయి...

డీఎం: డిపో పరిధిలో ఇప్పటికే అనేక గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులను అందుబాటులోకి తెచ్చాం. 'డయల్ యువర్ డీఎం'లో చేసిన ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నాం. ఇటీవల ఓ ఫిర్యాదు మేరకు పల్లపాడుకు రెండు ట్రిప్పుల నుంచి 6 ట్రిప్పులకు పెంచాం.

డిపో పరిధిలో ఈపీకే ఎలా ఉంది?

డీఎం: డిపో పరిధిలో ఎర్నింగ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ. 39.98గా ఉంది. అలానే ఓఆర్‌లో కూడా రూ. 68 ఉంది. గతంతో పోల్చుకుంటే రాష్ట్రంలోనే 128వ స్థానం నుంచి డిపో 72వ స్థానంలోకి తీసుకొచ్చాం.

సెల్‌ఫోన్‌డ్రైవింగ్, ఇతర సమస్యలపై చర్య?

డీఎం: సెల్‌ఫోన్‌డ్రైవింగ్ చేసినా, ఆల్కహాల్ సేవించి విధులకు వచ్చినా విధుల నుంచి తప్పిస్తున్నాం. ఇటీవల సెల్ ఫోన్ డ్రైవింగ్‌పై ఫిర్యాదు రావటాన్ని సీరియస్‌గా పరిగణించి తక్షణమే సదరు డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించాం.

చాలా గ్రామాలకు బస్సులు రావటం లేదన్న ఫిర్యాదులున్నాయిగా...

డీఎం: అటువంటి సమస్యలేదు. ఏదైనా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోతే మినహా అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. బస్సు సౌకర్యం కావాలని లిఖితపూర్వకంగా కోరితే ఉన్నతాధికారుల ఆదేశాలతో కల్పిస్తాం.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక రాహుల్ గాంధీనగర్‌లో ఆదివారం మజీద్ ఏ షమీం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీద్ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేస్తూ చంద్రన్న 'మద్రాస నవీన విద్య' పథకం ప్రవేశపెట్టి 555 మంది ఉర్దూ విద్యా వలంటీర్లను నియ మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 185 మదరసాలలో ప్రతి మదరసాకి ముగ్గురు వాలంటరీలను నియమించి వారికి రూ. 30,000 జీతాన్ని అందించ నున్నట్లు తెలిపారు. మరెన్నో పథకాల ద్వారా మైనార్టీలు మరింత అభివృద్ధి చెం దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ అంటూ చెడు మార్గంలో వెళ్తున్న యువ తను సరైన మార్గంలో పెట్టేందుకు మతపెద్దలు వారం, పది రోజులకు ఓసారి క్యాంపులు నిర్వ హించాలని కోరారు. కార్యక్రమంలో మౌలానా రహమతుల్లా సాబ్, ముజా హిద్, హఫీజ్ అబ్దుల్ ఖాదీర్ సాబ్, హఫీజ్ అబ్దుల్ గఫార్ సాబ్, షేక్ కరి ముల్లా పాల్గొన్నారు.



హైందవ శంఖారావం సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

జనవరి 5న 'హైందవ శంఖారావం'

- ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): దేవాలయాలకు స్వయం ప్రతి పత్తి కలిగించే లోపు వాటి నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల నిమిత్తం ప్రభుత్వం ముందు డిమాండ్లను ఉం చేందుకు హైందవ శంఖారావం సభను నిర్వహించనున్ననట్లు ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య అన్నారు. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవి ష్కరించారు. విజయాదిత్య మాట్లాడుతూ 2025 జనవరి 5న విజయ వాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రకటించిందని అన్నారు. మొత్తం 10 అంశాలతో కూడిన అజెండాను రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ వంగా జనార్దన్ రెడ్డి, మాధవరెడ్డి, గోపికృష్ణ పాల్గొన్నారు.



రేషన్ బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాలతో సీఎస్‌డీటీ భాస్కర్

130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ కలెక్టర్ భార్గవతేజ నుంచి ఆదివారం అందిన ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు సీఎస్‌డీటీ బీ భాస్కర్ ఏటుకూరు బైపాసు రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు వాహనాలను ఆపి తనిఖీ చేయగా వాటిల్లో 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నల్లపాడు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి క్రిమినల్, 6ఏ కేసు నమోదు చేశారు. నాలుగు వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఎస్‌డీటీ మాట్లాడుతూ రేషన్ బియ్యం అమ్మడం, కొనడం, అక్రమంగా రవాణ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్‌ను కించపరుస్తూ పోస్టులు

రెచ్చిపోతున్న వైసీపీ సోషల్ మీడియా ముఠా

- జిల్లా వ్యాప్తంగా పలు స్టేషన్లలో కేసుల నమోదు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను కించపరుస్తూ సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు వివాదాస్పదంగా మారుతున్నాయి. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడమే గాక ప్రజల్లో వైషమ్యాలు సృష్టించే విధంగా వైసీపీ సోషల్ మీడియా ముఠా రెచ్చిపోతోంది. ఆయా నేతలను కించపరచడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులను సైతం కించపరిచేలా పోస్టులు పెడుతున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ దారుణమైన కొటేషన్లు రాస్తూ ఫేస్‌బుక్ ఖాతాల్లో, సోషల్ మీడియా వేదికల్లో వైరల్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను కించపరిచే విధంగా పోస్టింగ్స్ పెట్టడమే కాకుండా ఆయన కుమార్తె, మైనర్ బాలిక ఫోటోలను కూడా మార్ఫింగ్ చేస్తూ అసభ్యకరమైన కామెంట్స్‌తో ఆయా పోస్టులను వైరల్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పార్టీల నాయకుల ఫిర్యాదుల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చంద్రబాబు, లోకేశ్‌ను కించపరిచేలా పోస్టింగులు పెట్టిన వ్యవహారంపై తాడికొండ, తాడేపల్లి, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లలో ఆదివారం కేసులు నమోదు చేశారు. పవన్ కల్యాణ్ ను కించపరుస్తూ పోస్టింగ్స్ చేసిన ఘటనపై శనివారం వట్టిచెరుకూరు, మేడికొండూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఆదివారం నగరంపాలెం, కొత్తపేట, పెదకాకాని పోలీస్ స్టేషన్లలోనూ కేసులు పెట్టారు. పెద్దిరెడ్డి సుధారాణి, రెడ్డి గారి అమ్మాయి అనే ఫేస్బుక్ ఐడీ లలో పవన్‌ని కించపరిచే పోస్టింగ్స్ పెట్టారు. దీనిపై పోక్సో యాక్ట్‌తో పాటు 353 బీఎన్ఎస్ ,67 ఐటీ యాక్ట్ 77 బీఎన్ఎస్ యాక్ట్ తదితర సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. నగరంపాలెంలో జనసేన నాయకుడు ఆళ్ళ హరి, కొత్తపేట స్టేషన్‌లో కొలసాని బాలకృష్ణల ఫిర్యాదుల మీదకు కేసులు నమోదయ్యాయి. చంద్రబాబును కించపరుస్తూ వారి ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన కామెంట్లతో తన ఫేస్బుక్కు లో పోస్టింగ్స్ పెట్టిన రౌడీషీటర్ కళ్ళం హరి కృష్ణారెడ్డిపై ఐపిసి 504, 294, 153 ఏ, 505 ఐపిసి తోపాటు 66 ఐటియాక్ట్ తదితర సెక్షన్ల కింద తాడికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేస్తున్న దాతలు

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జే కేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవ సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను నగ రానికి చెందిన డాక్టర్ యల మంచి మోహన్‌కుమార్, తుమ్మల వినోద కుమారి, డాక్టర్ యలమంచి సురేంద్రకుమార్, వెలగపూడి రాధికారాణీ, బూడపాటి లక్ష్మి విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు ఆదివారం చెక్కును దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లా డుతూ ఆడపిల్లల విద్యకు కృషి చేస్తున్న కమ్మ జన సేవ సమితి సేవలు అభినందనీయమని అన్నారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమితి సంయుక్త కార్యదర్శి మన్రిపూడి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు బీ పద్మకుమారి,కార్యదర్శి శ్రీనివాస్,ఎన్నికల అధికారి ఎండీ హిదాయతుల్లా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా వీ వజ్రబాబు, అసోసియేట్ అధ్యక్షులుగా సీహెచ్ భాను ప్రశాంత్ , ఉపాధ్యక్షులుగా డీ రాంబాబు,ఎం రవీంద్రబాబు, కేప్రసాద్‌బాబు,పీవీ కృష్ణ, పీ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా టీవీ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం అనిల్, కార్యదర్శులుగా కే మనోహర్, పీ దుర్గాప్రసాద్, ఏ హరిసాయిరామ్, పీ పవన్‌కుమార్, డీ జార్జీ విలియమ్, జీవీ జయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు.



'మేఘదూతము'ను ఆవిష్కరిస్తున్న వల్లూరి శివప్రసాదు, సీహెచ్ మస్తానయ్య తదితరులు

'మేఘదూతము' పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని పద్మావతి కళ్యాణ వేదికపై కొమాండూరు రామచంద్రాచార్యులు, కొమాండూరు రంగనాథ చార్యులు ఆంధ్రానువాదం 'మేఘదూతము' గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హజరైన అమరావతి పబ్లికేషన్స్ నిర్వాహకులు వల్లూరి శివ ప్రసాదు గ్రంథావిష్కరణ చేశారు. సభకు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత ప్రవచనకర్త డాక్టర్ రంగనాయకి మాట్లాడుతూ ప్రఖ్యాత రచయిత రామచంద్రాచార్యుల వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న రంగనాథాచార్యులు మహాకవి కాళిదాసు సంస్కృత మూలం 'మేఘదూతము'ను ఆంధ్రాను వాదంతో గ్రంథస్తం చేసి సఫలీకృతులవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ద్విభాష రచయిత, కవి డాక్టర్ కోగంటి విజయబాబు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ వీ నాగరాజ్యలక్ష్మి, కే కృష్ణమాచార్యులు, శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయవృత్తికే వన్నె సర్రాజు వేణుగోపాలరావు

- ప్రవాస భారతీయుడు డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి

గుంటూరు(తూర్పు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు సర్రాజు వేణుగోపాలరావు అని ప్రవాస భారతీయుడు డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి కొనియాడారు. యశస్వి సర్రాజు వేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానసభను స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభకు మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, కవిగా, గాయకుడిగా విభిన్న పాత్రలను సమర్థవంతంగా పోషించిన గొప్ప వ్యక్తి వేణుగోపాలరావు అని గుర్తుచేశారు. ఆయన శిష్యులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా 'గురు స్మరణ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను పున్నం జ్యోతి వాసు, మేడగాని శేషగిరిలకు అందజేశారు. సభలో ప్రజా గాయకుడు పీవీ రమణ, లెనీనా ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో 'సంస్కృతి' బాలచందర్, కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాస రావు, సర్రాజు వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పున్నం జ్యోతి వాసు, మేడగాని శేషగిరిలను సత్కరిస్తున్న నిర్వాహకులు



గుండెజబ్బుల శాస్త్రియ అవగాహన సభలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగుల్లో న్యూరోపతి వల్ల గుండెపోటు వచ్చినా నొప్పి తెలియదని కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి తెలిపారు. మధుమేహ నిరోధక మాసోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవన్‌లో ఆదివారం గుండె జబ్బుల శాస్త్రీయ అవగాహన సభ నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ గుండె పరీక్ష అనగానే చాలామంది ఈసీజీ చేయించుకుని అంతా బాగానే ఉందని భావిస్తారని, గుండె రక్తనాళాల్లో పూడికలు ఉన్నా కొల్లెస్ట్రాల్ రక్తనాళాల వల్ల విశ్రాంతిగా ఉన్నప్పుడు తీసే ఈసీజీ మాములు గానే ఉంటుందని వివరించారు. ఐదేళ్లకు ఒకసారి ట్రెడ్‌మిల్ పరీక్ష, ఎకో పరీక్ష చేయించుకోవాలని, ఆహారంలో అన్నం తగ్గించి ఆకు కూరలు, కాయ గూరలు ఎక్కు వగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గుండె జబ్బు బాధితులను పరీక్షించిన విజయలక్ష్మి, తగిన వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టీ సేవకుమార్, మేనేజర్ పీ నిర్మలరాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి టీవీ సాయిరాం, సభ్యులు చావా శివాజీ, లక్ష్మీ, జీ లక్ష్మీనారాయణ, ఆనంద రావు, ఎస్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలి

- డాక్టర్ పవన్‌కుమార్

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌పై అవ గాహన కలిగి ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని డాక్టర్ సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. 'మెదడు, నరాలు సంబంధించిన వ్యాధులు' అనే అంశంపై స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ జరిగింది. పవన్‌కుమార్ మాట్లాడుతూ మన గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలలో బ్లాక్‌లు ఏర్పడినప్పుడు ఎలా గుండెపోటుకు దారి తీస్తుందో, మెదడుకు సంబంధించిన రక్తనాళాలలో కూడా బ్లాక్‌లు ఏర్పడినా, రక్తనాళాలు చిట్లినా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తుందని వివరించారు. అకస్మాత్తుగా కంటి చూపు పోయినా, వినికిడి పోయినా, స్పర్శ పోయి మొద్దుబారిపోయినా, ఉన్నట్లుండి తూలుడు, భరించలేని తలనొప్పి ఇవన్నీ బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా పేర్కొన్నారు. నిత్యం వ్యాయామం, పౌష్టికాహారం, ధూమపానం, మద్యం తాగడానికి దూరంగా ఉండటం వల్ల అనారోగ్యాలు దరి చేర వన్నారు. అనం తరం పవన్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కో ఆర్డినేటర్ సాయిరామ్, ఏవీ రామారావు, డాక్టర్ ఆర్ రామ చంద్రరావు, అన వేమ ట్రస్టు అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి పాల్గొన్నారు.



'మెదడు, నరాలు సంబంధించిన వ్యాధులు' అంశంపై మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్

పట్టభద్రుల ఓటుహక్కు అర్హతపై ఈసీ స్పష్టత

- 10, ఇంటర్ సర్టిఫికెట్లతో సంబంధం లేదు
- జీవో నెంబరు. 536లో పేర్కొన్న యూనివర్సిటీల్లో దేని నుంచైనా డిగ్రీ చాలు
- బీఎల్‌వోలు ఏ ఒక్క దరఖాస్తుదారుడిని ఆఫీసుకు పిలిపించుకోరాదు
- సీఈవో వివేక్‌యాదవ్ ఆదేశాలు

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక నిమిత్తం ఓటుహక్కు పొందేందుకు కొన్ని సందేహాలను ఈసీ నివృత్తి చేస్తూ స్పష్టతనిచ్చింది. మరో మూడు రోజుల్లో ఓటరుగా నమోదయ్యేందుకు గడువు ఉన్న నేపథ్యంలో తన దృష్టికి వచ్చిన కొన్ని అంశాలపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ వివరణ ఇచ్చారు. కొంతమంది బీఎల్‌వోలు/వీఆర్‌వోలు ఫారం-18లో ఫైల్ చేసిన ఒరిజినల్ సర్టిఫికేట్లకు బదులుగా అటెస్టెడ్ కాపీలు ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్స్‌కి కూడా అటెస్టు చేసిన కాపీలను జతపరిచిన హార్డ్ కాపీని ఇవ్వమని కోరుతున్నారు. కొందరైతే 10, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్లు చూపించమంటున్నారు. 10+2-3 సిస్టమ్‌లో పాస్ అయ్యారా, లేదా అని ప్రశ్నిస్తున్నారు. క్రాస్ చెక్ కోసం సర్టిఫికేట్లను తీసుకొని వార్డు సచివాలయాలకు రమ్మంటున్నారు. ఇవన్నీ కరెక్టు కాదని సీఈవో స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో దాఖలైన ఫారం-18కు సంబంధించి బీఎల్‌వోలు సంబంధిత దరఖాస్తుదారుని నివాసానికి వెళ్లి ఒరిజినల్ సర్టిఫికేట్‌ని పరిశీలించాలి. సరిగా ఉంటే కరెక్టుగా ఉందని పేర్కొనాలి. లేకుంటే తిరస్కరిస్తున్నట్లు సంతకం తీసుకోవాలన్నారు. ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న వ్యక్తి డిగ్రీ పట్టభద్రుడైతే చాలు. 10, ఇంటర్ సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. సరైన ఎంక్వయిరీ చేయకుండా అప్లికేషన్‌ని ఆమోదించడం, తిరస్కరించడం చేయరాదని స్పష్టం చేశారు. బీఎల్‌వోలు ప్రతీ ఒక్క దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి డాక్యుమెంట్లను సేకరించాలి. అంతే తప్పా దరఖాస్తుదారుడిని పరిశీలన నిమిత్తం తన కార్యాలయానికి రావాలని ఆదేశించరాదన్నారు. ఒకవేళ దరఖాస్తుదారుడి ఇంటికి పలుమార్లు వెళ్లినా అందుబాటులో లేకపోతే నోటీసు జారీ చేయాలన్నారు. 2006వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబరు. 536లో ఏ విశ్వవిద్యాలయాల డిగ్రీలను అర్హతగా పరిగణించ వచ్చో స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు ఆ జీవోని క్షుణ్ణంగా పరిశీలించి దానిని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు.

1.35 లక్షలకు పైగా దరఖాస్తులు

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అక్టోబరు 30వ తేదీ(గత బుధవారం) వరకు అందిన దరఖాస్తుల వివరాలను ఈసీ విడుదల చేసింది. దాని ప్రకారం ఏలూరులో 4910, కృష్ణా జిల్లాలో 22859, ఎన్‌టీఆర్ జిల్లాలో 25868, గుంటూరు జిల్లాలో 47668, బాపట్ల జిల్లాలో 9899, పల్నాడు జిల్లాలో 23700 దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో వచ్చాయి. ఇప్పటికే 1.35 లక్షలకు పైగా దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

నల్లమలలో ఇనుప యుగ ఆనవాళ్లు

పల్నాట నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది ఒడ్డున ఇనుప యుగపు ఆనవాళ్లు వెలుగు చూశాయి. వాటిలో నిలువురాళ్లు, బండల గుట్టలు ఉండడం విశేషం. క్రీస్తు పూర్వం 3000 ఏళ్ల నాటి ఆదిమానవుడు జీవనానికి సంబంధించిన చరిత్ర ఇక్కడి కట్టడాలు, సమాధుల రూపంలో నిక్షిప్తమై ఉంది. అడవుల్లో ఉన్న ఈ రాళ్లను సమీప గ్రామాల్లోని ప్రజలు 'రాక్షస బండలు' అని పిలుస్తుంటారు. వాస్తవానికి వాటిని 'మెన్‌హిర్స్' అని అంటారు. దేశంలోనే కాదు ప్రపంచంలో ఆదిమానవుని నాగరికత వెలసిల్లిన ప్రతిచోటా ఇలాంటి మెన్‌హిర్స్ బయటపడుతూనే ఉన్నాయి. పల్నాడులో ఉన్నట్టుగా ఇంత పెద్ద ఎత్తున ప్రాచీన కాలపు సమాధులు మరెక్కడా లేవు.



సమాధి చుట్టూ రాళ్లగుట్ట





గంగలకుంట సమీపంలో నిలువురాళ్లు

మాచర్లటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటకి నైరుతి దిక్కున కృష్ణానది కుడి గట్టుపైన ఉన్న ముగ్గ దిన్నెకాలువ పక్కన నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు పది కిలోమీటర్ల పరిధిలో ఇనుప యుగపు స్మారక కట్టడాలు ఉన్నాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంతోపాటు మాచర్ల మండలం అచ్చమ్మకుంట పరిసర ప్రాంతాల్లోనూ ఇళ్ల మాదిరి నిర్మించిన సమాధులు ఉన్నాయి. వాటి నిర్మాణం కూడా భిన్నంగా ఉంది. 5 నుంచి 10 మీటర్ల వ్యాసార్థంతో 2 మీటర్ల ఎత్తులో పెద్ద నాపరాళ్లను నలువైపులా స్వస్తిక్ ఆకారంలో పేర్చి గది మాదిరిగా ఉన్నాయి. గది చుట్టూ పైన గులకరాళ్లతో ఉబ్బెత్తుగా అమర్చి ఉంది. భూమి లోపల కొంత, ఉపరితలంపై కొంత భాగంగా కనపడే విధంగా ఉన్నాయి. ఈ నిర్మాణానికి ఉత్తరాన 10 నుంచి 25 అడుగుల ఎత్తు, 3 నుంచి 5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందంతో నిలువురాళ్ల ఏర్పాటు చేసి ఉన్నాయి. చనిపోయిన వారికి గుర్తుగా ఇలా పెద్ద శిలలను నిలబెట్టారు. నిలువు రాళ్లపై కొన్ని చోట్ల మనిషి ఆకృతితో పాటు ఎద్దు, ముగ్గు బొమ్మలు కూడా ఉన్నాయి. గూడు సమాధులు (సిస్ట్ బరియల్స్)తోపాటు సామూహిక సమాధులు (డాల్మెన్‌లు-నాలుగైదు మృతదేహాలను కలిపి) ఉన్నట్లుగా భావించవచ్చు. నదీ తీరంలో సమాధులన్నింటికీ దక్షిణ ముఖ ద్వారం నిర్మించడం గమనించాల్సిన అంశం. మృతదేహాన్ని ఖననం చేసి దాని చుట్టూ సమాధి, ప్రహరీ ఏర్పాటు చేసి ఉంది. దేశంలో అనేక చోట్ల ఇలాంటి నిలువు రాళ్లు ఉన్నప్పటికీ అతి పొడవైన దాదాపుగా 20 అడుగుల ఎత్తుగల నిలువురాళ్లు ఇక్కడ పదుల సంఖ్యలో ఉండడం చారిత్రకంగా పల్నాటి ప్రాంత విశిష్టత గుర్తు చేస్తుంది.


▸ రాక్షస గూళ్లు, నిలువురాళ్లు (మెన్‌హిర్స్) ▸ కృష్ణానది తీరంలో పదుల సంఖ్యలో...

రాక్షస బండలు అనడానికి కారణం..

ఈ సమాధులు పెద్ద బండరాళ్లతో ఉండడం, ఇక్కడ లభించే మట్టి పాత్రలు, అస్థి పంజరాలను చూసి ఇవి సామాన్య మానవుడివి కావని గుర్తించడంతో వీటిని రాక్షస గుండ్లు, రాక్షస బండలు అని స్థానికులు పిలుస్తుంటారు. రాతి యుగంలో మానవుడు మృతదేహాలను ప్రకృతికే వదిలేసే వారు. నవీనయుగానికి వచ్చే సరికి మృతదేహాన్ని క్రమపద్ధతిలో పాతిపెట్టడం జరిగింది. బృహత్ రాతి యుగంలో మానవ మృతదేహాన్ని జంతువులు తినకుండా, సామగ్రిని పాడు చేయకుండా పెద్ద రాళ్లతో సమాధులు నిర్మించారు. మృతదేహంతోపాటు మృతులు ఉపయోగించిన వ్యవసాయ సామగ్రి, మట్టి పాత్రలను కూడా సమాధి చేసే వారు. ఈ సమాధుల చుట్టూ బండరాళ్లను పేర్చే వారు. వీటి ఆనవాళ్లు దేశమంతా ఉన్నాయి. కానీ, ప్రహరీలతో వాస్తుపరంగా ఇళ్ల మాదిరి సమాధులు ఉండడం పల్నాడు ప్రాంతంలోనే కనిపిస్తోంది. చరిత్రకు సాక్ష్యాలైన ఆనాటి ఆనవాళ్ల (మెన్‌హిర్స్)ను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. ఒకప్పుడు కృష్ణా తీరం వెంట సుమారు 300కు పైగా ఇలాంటి నిలువురాళ్లు ఉండేవని, కాలక్రమంలో ధ్వంసమైపోయి కేవలం పదుల సంఖ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి. మానవ చరిత్రకు ఆధారమైన, వారసత్వ కట్టడాలు, రాజులు, రాజ్యాల గుర్తులే కాకుండా ఆది మానవుల పురాతన చరిత్ర ఆనవాళ్లు కూడా భాగమన్న విషయాన్ని ప్రజలు అవగాహన కలిగి ఉండాలి.

వారసత్వ సంపదను కాపాడాలి | పురావస్తు శాఖకు ప్రజల విజ్ఞప్తి

ఇనుము వాడకం మొదలుపెట్టిన కాలాన్ని ఇనుప యుగమని చరిత్ర చెబుతోంది. క్రీస్తు పూర్వం 1000 నుంచి ఇనుప యుగంగా పేర్కొంటారు. నాటి మానవుల జీవనం ప్రధానంగా సేద్యంపై ఆధారపడి ఉండేది. నాటి సమాధుల నిర్మాణ శైలిని పరిశీలిస్తే వారు పక్కాగా వాస్తును పాటించే వారని అర్థమవుతుంది. అయితే, 1000 బీసీ నాటికి మన దేశంలో డబ్బు వినిమయం మొదలు కాలేదని తెలుస్తోంది. కేవలం వస్తు మార్పిడి ద్వారానే వారు వ్యాపారం చేసే వారని అర్థమవుతోంది. ఇనుప యుగపు ఆనవాళ్లు మన రాష్ట్రంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో గతంలో బయటపడ్డాయి. కానీ, ఇంత పెద్ద స్థాయిలో మెన్‌హిర్‌లు పల్నాడు జిల్లాలోనే ఉన్నాయి. మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో కృష్ణా తీరం వెంబడి అటవీ ప్రాంతంలో ఉన్న రాక్షస బండలు ఇనుప యుగపు మెగాలితిక్ కల్చర్‌కి ప్రతీకగా చెప్పవచ్చు. నాగరికత విలసిల్లిన ప్రపంచమంతటా మెన్‌హిర్‌లు ఉన్నా వాస్తుశైలితో ఇంత పెద్ద నిర్మాణాలు మాత్రం పల్నాడు కృష్ణా తీరంలోనే ఉండడం విశేషం. పురావస్తు శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వారసత్వ సంపదగా గుర్తించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అచ్చమ్మకుంట వద్ద రాక్షసగూళ్లు, సమాధులు

అనుమతులు లేకుండా.. అట్టహాసంగా.. చేనేత భవన్ నిర్మాణం

అయిదుకోట్ల రూపాయల ప్రజాధనం వృధా!

ఈ పాపానికి బాధ్యులెవరు?

మంగళగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయిదు కోట్ల రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన భవన సముదాయం ఎనిమిది నెలలుగా నిరర్థకంగా మిగిలింది. మంగళగిరిలో చేనేత వస్త్ర వ్యాపారుల ప్రయోజనార్థం ఈ భవనాన్ని మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో అట్టహాసంగా నిర్మించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ప్రజాప్రతినిధుల ఆదేశాల ప్రకారం నిబంధనలను తోసిరాజని అధికారులు ఈ భవనాన్ని ఆగమేఘాల మీద నిర్మించారు. ఆ వెంటనే రాజ్యసభసభ్యుడు, నాటి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని పిలిపించి బ్రహ్మాండంగా భవన ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. అసలీ భవనాన్ని ఎందుకు నిర్మించారో కూడ నాటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పదేపదే చెప్పుకొచ్చారు. మంగళగిరి నగరం నుంచి మిద్దెసెంటర్ మీదుగా జాతీయరహదారిని చేరుకునే ప్రధాన రోడ్డు మార్గంలో పలు చేనేత వస్త్ర దుకాణాలు రోడ్డును ఆక్రమించి వుండడంతోపాటు... సదరు వస్త్ర దుకాణాలకు వచ్చిపోయే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రస్థాయిలో తలెత్తుతున్నాయి. ఈ ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించాలంటే సదరు తెనాలి రోడ్డును విస్తరించాలని...ఇందుకు అవరోధంగా వున్న దుకాణాల తాలూకు ఆక్రమణలను తొలగించాలని అప్పట్లో ప్రతిపాదించారు. ఈ క్రమంలో చేనేత వస్త్ర వ్యాపారులకు నష్టం జరుగకుండా చూడాలన్న ఉద్దేశంతో ఆ షాపులన్నింటిని ఒకేచోటకు తరలించాలన్న ఆలోచనతో ఎంటీఎంసీ ఆధ్వర్యంలో భారీ చేనేతవస్త్ర దుకాణ సముదాయం కోసం ఈ భవనాన్ని అయిదుకోట్ల రూపాయలకు పైగా సాధారణ నిధులతో నిర్మించేశారు. నిర్మాణపనులు పూర్తవ్వడమే ఆలస్యమన్నట్లుగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 12వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపించేశారు. ఇంతవరకు బాగానే వుంది. కానీ ఏ ఉద్దేశంతో నైతే ఈ చేనేత భవన్‌ను నిర్మించారో...ఆ ఉద్దేశాన్ని నెరవేర్చకుండా ఆ భవనాన్ని నిరర్థకంగా వదిలేసి కూర్చొన్నారు.

నిజానికి చేనేత భవన్ నిర్మాణం చట్టబద్ధంగా జరుగలేదు. ఈ భవననిర్మాణంలో ఎన్నో రకాల నిబంధనలను తుంగలో తొక్కారు. ఆ నిబంధనల ఉల్లంఘనే నేడు చేనేత వ్యాపారులకు షాపులను బదలాయించేందుకు వీలులేకుండా అడ్డుపడుతున్నాయని ఎంటీఎంసీ అధికారులు చెబుతున్నారు. ఆ నిబంధనల ఉల్లంఘన విషయానికొస్తే...అసలు చేనేత భవన్ నిర్మాణానికి ఉద్దేశించిన సుమారు 40 సెంట్ల స్థలం ఎంటీఎంసీకి చెందినది కాదు. అది పక్కా గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందినది. గతంలో జిల్లా పరిషత్ వారు ఆ స్థలాన్ని ప్రజాప్రయోజనార్థం ఆర్టీసీ బస్టాండు కోసం ఇచ్చారు. మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో కొత్త బస్టాండును 1987లో ఆర్టీసి నిర్మించుకున్నాక బస్టాండును ఇక్కడి నుంచి అక్కడికి తరలించారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని ఆర్టీసి సంస్థ జిల్లా పరిషత్‌కు అప్పగించకుండా తన స్వాధీనంలో వుంచుకుంది. దీనిపై జిల్లా పరిషత్ కోర్టులలో పోరాడి సదరు స్థలంపై తన యాజమాన్యపు హక్కులను రుజువు చేసుకుని తన స్వాధీనంలోకి తీసుకుంది. సరిగ్గా ఇదే సమయంలో నగరంలో తెనాలి రోడ్డులో ట్రాఫిక్ సమస్య తెగని సమస్యగా అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెనాలి రోడ్డును విస్తరించి సమస్యను పరిష్కరిస్తామని హామీలను ఇచ్చి ఆ రోడ్డులో వున్న చేనేత దుకాణదారుల కోసమని చేనేత భవన్‌ను నిర్మించి షాపులను అద్దె ప్రాతిపదికన ఇస్తామని ప్రకటించారు.



మంగళగిరిలో నిరర్థకంగా వున్న చేనేత భవన్

ఈ క్రమంలో నగరంలో ప్రభుత్వ ఖాళీస్థలాలను గుర్తించే క్రమంలో జిల్లా పరిషత్ అధికారులు ఈ స్థలం పరిశీలనకు వచ్చారు. ఈ స్థలంలో 40 షాపులతో కూడిన అయిదంతస్తుల భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనిని జడ్పీ ఆధ్వర్యంలో నిర్మించి జిల్లా పరిషత్ యాజమాన్య ఆస్తిగా మంగళగిరిలోని చేనేత వస్త్ర వ్యాపారులకు అద్దెల కింద ఇచ్చినట్టయితే అంతా సవ్యంగా సాగిపోయేది. కానీ అందుకు భిన్నంగా వ్యూహరచన చేశారు. జిల్లా పరిషత్ నుంచి ఎంటీఎంసీకి కొద్ది సంవత్సరాల పాటు స్థలాన్ని లీజుకు తీసుకుని రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక నిధులతో భవన నిర్మాణం చేయాలని ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి చాలా వేగంగా దస్త్రాలను మునిసిపల్ పరిపాలన శాఖకు నివేదించారు. అయితే స్థలంపై ఎంటీఎంసీకి పూర్తి యాజమాన్యపు హక్కులు లేనందున గ్రాంటును మంజూరు చేయడం సాధ్యం కాదని నాటి పురపాలనశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి స్పష్టం చేస్తూ ఎంటీఎంసీకి తాఖీదులను పంపించారు. దీంతో భవన నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును ఎంటీఎంసీ సాధారణ నిధుల నుంచి వెచ్చించేలా ఆళ్ల రామకృష్ణారెడ్డి అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు గత్యంతరం లేక సాధారణ ఖాతా నుంచి అయిదు కోట్ల రూపాయలకు పైగా నిధులను వెచ్చించేందుకు ఆమోదముద్ర వేశారు. దీంతో అంతపెద్ద భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండానే ఎడాపెడా నిర్మాణం చేశారు.

నగరంలో ఎవరైనా అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేస్తే నానా యాగీ చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ భవన నిర్మాణ విషయంలో చేష్టలుడిగి మిన్నకుండిపోయారు. యాజమాన్య హక్కులు లేకుండా మునిసిపల్ సాధారణ నిధులను రూపాయి కూడా ఖర్చు చేయరాదన్న నిబంధనను అధికారులందరూ తుంగలో తొక్కారు. పైగా జిల్లా పరిషత్ వారి లీజు అగ్రిమెంటులో సదరు స్థలంలో తాత్కాలిక నిర్మాణాలను మాత్రమే చేపట్టాలన్న నిబంధనను కూడ పూర్తిగా ఉల్లంఘించి అక్కడ భారీ అయిదంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీనిపై ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయిస్తే...నిబంధలనకు విరుద్ధంగా నిర్మించిన ఈ భవనాన్ని తక్షణమే కూల్చివేయాలన్న ఆదేశాలు వెలువడే అవకాశం లేకపోలేదు. దీంతో అధికారులు ఇప్పుడీ భవనాన్ని ఏం చేయాలో తెలియక సందిగ్ధావస్థలో పడిపోయారు.

వచ్చిన ఉద్యోగం కాదని... నచ్చిన ఉద్యోగం సంపాదించి



జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ సక్సెస్ స్టోరీ

గుంటూరు సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కృషితో నాస్తి దుర్భిక్షం అని పెద్దలంటారు. కృషి,పట్టుదల ఉంటే ఎంతటి క్లిష్టమైన పరిస్థితి లో నైనా అనుకున్నది సాధించవచ్చు. అటువంటి కోవకు చెందిన వారే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రస్తుత డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ. పేదరికం పై ఆయన పోరాడారు. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యం వైపే సాగారు. వచ్చిన ఉద్యోగాలతో సరిపెట్టుకోలేదు. గ్రూపు-1 పోస్టు సాధించే వరకు విశ్రమించలేదు.

తండ్రి తాపీ మేస్త్రి...

కృష్ణ సొంత గ్రామం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కనుమళ్ల. చాలా వెనుకబడిన ప్రాంతం. తల్లి తండ్రులు నిరుపేద కూలీలు. తండ్రి చిన వెంకయ్య తాపీ మేస్త్రి.తల్లి చిన్నమ్మ సాధారణ వ్యవసాయ కూలీ.మొత్తం నలుగురు పిల్లలు. 10వ తరగతి వరకు సింగరాయకొండ పాఠశాలలో నే చదువుకున్నారు.డిగ్రి కందుకూరులో పూర్తి చేశారు. ఆ తర్వాత ఉపాధి కోసం అని తండ్రి తెలంగాణ కు వెళ్లిపోవడం తో పీజీ వరంగల్ లో చదవాల్సి వచ్చింది. పీ ఎహెచ్ డీ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

రెండు సార్లు ఎస్ ఐ ఉద్యోగం..

కృష్ణకి మొదట 1995 లో ఏపీఎస్‌పీలో ఎస్ఐ ఉద్యోగం వచ్చింది. 1998 లో సివిల్ ఎస్ఐ గా ఎంపికయ్యారు. ఎస్ఐ గా వరంగల్ జిల్లా లోని మరిపెడ్ బంగ్లా, నర్సింహులపేట,దంతాల పల్లెలో ,హైదరాబాద్ నగరం లోని గోల్కొండ, శాలిబండ లో పనిచేశారు. మంచి హోదా కలిగిన ఎస్ఐ ఉద్యోగం చేస్తున్నా తెలియని అసంతృప్తి వెంటాడుతూ ఉండేది.పేద ప్రజలకు నేరుగా సహాయం చేయగలిగే ఉద్యోగం సంపాదించాలన్న తపన ఎక్కువగా ఉండేది. ఎస్ ఐ ఉద్యోగం కన్నా మెరుగైన గ్రూపు-1 పోస్టు లో అది సాధ్యపడుతుందని భావించారు. దాంతో 1999 లో గ్రూపు-1 పరీక్ష రాసారు. మొదటి ప్రయత్నం విఫలం కావడంతో నిరుత్సాహ పడకుండా 2003 లో మళ్ళీ పరీక్ష రాశారు. అప్పుడు రాసిన పరీక్షల ఫలితాలు 2007 లో విడుదల అయ్యాయి. గ్రూపు-1 తగిన ర్యాంకు రావడంతో ఎంపీడీఓ గా ఎంపికయ్యారు.ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఎంపీడీఓ గా పనిచేశారు. పదోన్నతి మీద విజయనగరం ఫైనాన్స్ మేనేజర్ గా పనిచేశారు.తదుపరి బాపట్ల డీఆర్‌డీఏ పీడీగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గా వచ్చారు.

పరాజయం ఎదురైనా ప్రయత్నం ఆపలేదు : కృష్ణ, డిప్యూటీ సీఈఓ

ఎస్ఐ ఉద్యోగం చేస్తున్నప్పుడు ఏదో తెలియని వెలితి వెంటాడేది. నా మనసు నువ్వు ఉండాల్సిన స్థానం ఇది కాదని చెప్పేది.చాలా మంది వారించినా ఎస్ఐ ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూపు-1 కి సిద్ధపడ్డా.మొదటి సారి పరాజయం ఎదురైనా మళ్ళీ ప్రయత్నం చేశా అనుకున్నది సాధించా. నేను ఈనాటి యువత కు ఇచ్చే సలహా ఒక్కటే.ఒక్క ప్రయత్నం విఫలం అయితే మరోసారి ప్రయత్నం చేయండి. చదువు లో సక్సెస్ కాకపోతే మరో రంగంలో సక్సెస్ కావచ్చు.

బీచ్ రిసార్ట్స్‌కు.. భలే గిరాకి



హరితా బీచ్ రిసార్ట్స్ కాటేజీలు



ఆధునీకరిస్తున్న ఏసీ స్టాండెడ్ కాటేజీలు

◆ సూర్యలంక తీరంలో హరితా బీచ్ రిసార్ట్స్ ◆ ఏడాది పొడవునా బుకింగ్‌లే ◆ హైదరాబాద్ వాసులే అత్యధికం

బాపట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సరదాగా గడిపేందుకో, ఆహ్లాదకర వాతావరణంలో ఉండేందుకో, ప్రకృతి ఒడిలో సేద తీరేందుకో.. ఏదో ఒక పర్యాటక ప్రదేశానికి వెళతుంటాం. అలాంటి పర్యాటక ప్రదేశాల్లో బాపట్ల జిల్లా కేంద్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్రతీరం కూడా ఒకటి. కుటుంబసభ్యులు, పిల్లలు, స్నేహితులు, కొత్తగా పెళ్లయిన వారు.. ఇలా చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా, వీకెండ్స్‌లో, పర్వదినాల్లో, పుణ్యస్నానాల సమయంలో ఇక్కడికి బాపట్ల వాసులే కాకుండా పలు ప్రాంతాల నుంచి వచ్చే వారు అధికసంఖ్యలోనే ఉంటుంటారు. ఈ సముద్రతీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన హరితా బీచ్ రిసార్ట్స్ ఉంది. దీని డిమాండ్ నానాటికి పెరుగుతోంది. ఏడాది పొడవునా ఇక్కడి కాటేజీలు ఆన్ లైన్ బుకింగ్‌లోనే బుక్ అవుతూనే ఉంటాయి. కాటేజీల సంఖ్య తక్కువే అయినా డిమాండ్ మాత్రం చాలా ఎక్కువగా ఉంది. అందులో అత్యధికశాతం హైదరాబాద్ వాసులే ఉన్నారు. అప్పుడప్పుడు మాత్రమే ఆంధ్రప్రాంత పర్యాటకులకు అవకాశం లభిస్తోంది.

వీకెండ్స్‌లో ఒక ధర.. మిగిలిన రోజుల్లో మరో ధర

హరితాబీచ్ రిసార్ట్స్‌లో 31 ఏసీ కాటేజీలు, రెండు నాన్ ఏసీ కాటేజీలు ఉన్నాయి. వీటిల్లో 10 డీలక్స్ కాటేజీలు కూడా ఉన్నాయి. వీటికి అత్యధిక డిమాండ్ ఉంది. సముద్రానికి ఎదురుగా ఉండే ఈ కాటేజీలకు శుక్ర,శని ఆదివారాలలో రూ.4,480 చొప్పున, ఏసీ స్టాండెడ్ కాటేజీలు 13 ఉండగా వీటికి రూ.3,500 చొప్పున, న్యూస్టాండెడ్ కాటేజీలు 3 ఉండగా వీటికి రూ.3,600 చొప్పున,నాన్ ఏసీ రూమ్‌లకు రూ. 2,240 చొప్పున తీసుకుంటారు. మిగిలిన రోజులలో డీలక్స్ కాటే జీలకు రూ.3,360, ఏసీ స్టాండెడ్ కాటేజీలకు రూ.2,500, న్యూస్టాండెడ్ కాటేజీలకు రూ.2,800,నాన్ ఏసీ రూమ్ లకు రూ.1680 చొప్పున తీసుకుంటారు. మిగిలిన కొన్నికాటేజీలను ఆధునీకరిస్తున్నారు.



బీచ్ రిసార్ట్స్‌లోని బార్ అండ్ రెస్టారెంట్



బీచ్ రిసార్ట్స్ లోని ఏసీ డైనింగ్ హాలు

బీచ్ రిసార్ట్స్‌లో సౌకర్యాలు

పర్యాటకులకు కావాల్సిన అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు రిసార్ట్స్‌ను ఆధునీకరించారు. అందుబాటులో బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. ఫ్యామిలీతో భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా ఏసీ డైనింగ్‌హాలు ఏర్పాటు చేశారు. వనభోజనాలు చేసేందుకు కాటేజీలకు ఎదురుగా ఆహ్లాదకరంగా చెట్లు పెంచారు. కాటేజీల బయట కూర్చుని సముద్ర తీరాన్ని వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

ఆర్డర్ ఇస్తే వనభోజనాలు ఏర్పాటు చేస్తాం

బీచ్ రిసార్ట్స్ మేనేజర్ జీ అశోక్



కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరానికి వచ్చే భక్తులు ఆర్డర్ ఇస్తే వనభోజనాలు ఏర్పాటు చేస్తాం. కాటేజీలలో ఉండేవారికి బ్రేక్‌ఫాస్ట్ ఇస్తాం. ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉండవచ్చు. అదనంగా ఉంటే ఒక్కొక్కరికి రూ.560 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. క్యాండిల్ లైటు డిన్నర్, క్యాంప్ ఫైర్ అవకాశం కూడా కల్పిస్తాం. హైక్వాలిటీ ఆల్కాహాలు అందుబాటులో ఉంటుంది.

అనుమతి లేకుండా ర్యాలీ.. వైసీపీ నాయకులపై కేసు

గుంటూరు (కార్పొరేషన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా గుంటూరులో ర్యాలీ నిర్వహించిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్టు ఆదివారం పాతగుంటూరు పోలీసులు తెలిపారు. వైసీపీ నగర అధ్యక్షుడిగా డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు పదవీ స్వీకార సభ సందర్భంగా శనివారం కాకాని రోడ్డులోని మంగళదాస్‌నగర్ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.



10మంది జూదరుల అరెస్టు

పెదకాకాని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెనిగండ్లలో 10మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. వెనిగండ్ల శివారులోని పొలాలలో కోడి పందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పెదకాకాని సీఐ నారాయణస్వామి సిబ్బందితో వెళ్లి వారిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద రూ.11,800 నగదు, రెండు కోళ్లను స్వాధీనపర్చుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందుతిని చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సీఎమ్ కాలనీకి వీర్రురాజు (39) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రాజుకి ఓ మహిళతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కాగా గత నెల 29వ తేదీన కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకలను నివారించే మందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొంది ఆరోగ్యం మెరుగుపడటంతో డిచార్జ్ చేశారు. రెండు రోజుల క్రితం తిరిగి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవడంతో పట్టణ జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ మృతి

తెనాలి, మారీసుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం సమీపంతో శనివారం తెల్లవారుజామున ఆటో అదుపుతప్పి గాయపడి ఆటో కార్మికుడు మృతి చెందిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూరు మండలం బేతాళపురంనకు చెందిన వినోద్ (31) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వేమూరు నుంచి తెనాలికి ఆటోలో వస్తున్న క్రమంలో వైకుంఠపురం సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో వినోద్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు పట్టణ జిల్లా వైద్యశాలకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వినోద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

17న పద్మశాలీయ బహూత్తమ సంఘం కార్తీక వనసమారాధన

తెనాలి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని ఈ నెల 17న శ్రీ పద్మశాలీయ బహూత్తమసంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్ చెప్పారు. ఆదివారం పట్టణంలోని శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన ఋషి స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మవన సమారాధన మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలలను సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌మాట్లాడుతూ ఈ నెల 17 ఆదివారం తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పద్మశాలియ కార్తీమాస వనసమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మార్కండేయ మహాయజ్ఞం, ఏక రుద్రాభిషేకం, సత్యానారాయణ స్వామి వ్రతపూజలు జరుగుతాయన్నారు. అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, పంచమర్తి భాస్కరరావు, గట్టుబాల శ్రీనివాసరరావు, అక్కల శ్రీరామ్, దివి హేమంత్‌కుమార్, గుంటి వెంకట్, దీపాల సాయినాద్, పలువురు సంఘసభ్యులు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం

తెనాలి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత సైనిక సంక్షేమ సంఘం తెనాలి వారి ఆధ్వర్యంలో ఈ నెల 5న మాజీ సైనికుల సమ్మేళనం కొత్తపేటలోని ఏపీ స్టేట్ పెన్షనర్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు నారాయణం కమల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ డైరెక్టర్, గుంటూరు జిల్లా మాజీ సైనిక సంక్షేమ అధికారులు, జిల్లా నాయకులు, బ్యాంక్ అధికార్లు పాల్గొననున్నట్లు చెప్పారు. మాజీ సైనికులకు స్పర్శ్ సమస్యలు, లైఫ్ సర్టిఫికెట్లు వంటి వాటిని అందించడం జరుగుతుందన్నారు. తెనాలి డివిజన్‌లోని మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అకట్టుకున్న బ్రహ్మం గారి నాటకం

గుంటూరు (తూర్పు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్త బృందం ఆదివారం ప్రదర్శించిన బ్రహ్మంగారి నాటకం ఆకట్టుకుంది. సూరపనేని శ్రీకాంత్ సహకారంతో నాటకం ప్రదర్శించారు.

అధ్వానంగా ఐసీడీఎస్ భవన పరిసరాలు

- అసౌకర్యాల నడుమ అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం
- ఆవరణలో మందుబాబుల ఆగడాలు
- పందుల సంచారం.. వర్షం కురిస్తే బురద, దుర్గంధం



ప్రహరీ లేకుండా అధ్వానంగా ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిసరాలు

తెనాలి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం అసౌకర్యాల నడుమ అవస్థలు పడుతోంది. కృష్ణా, పశ్చిమ డివిజన్, తూర్పు-నిజాంపట్నం కాల్వల మధ్య కట్టపై ఐసీడీఎస్ భవనాన్ని 15ఏళ్ల క్రితం నిర్మించారు. కార్యాలయ భవన ఆవరణలో ప్రహరీ నిర్మించకపోవడంతో మందుబాబుల ఆగడాలు, పందుల సంచారం, పిల్లల మలమూత్ర విసర్జన, వర్షం వస్తే బురద, దుర్గంధంతో నానా ఇక్కట్లు పడుతున్నారు. కొల్లిపర మండలం, తెనాలి పట్టణంతో పాటు రూరల్ మండలంలోని ఏడు సెక్టార్లలో 200 అంగన్‌వాడీ కేంద్రాలను ఈ కార్యాలయం పర్యవేక్షిస్తుంది. ప్రాజెక్టు అధికారితో పాటు సిబ్బంది, సూపర్‌వైజర్లు నిత్యం ఇక్కడ విధులు నిర్వహించడంతో పాటు ప్రతి నెలా అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్ల సమావేశాలు ఏర్పాటు చేస్తుంటారు. కార్యాలయం కాల్వల మధ్య కట్టపై ఉండటంతో రహదారి కూడా లేకపోవడం వర్షం పడిన సమయంలో కార్యాలయం ఎదుట అంతా బురదగా మారుతోంది. సమీపంలో పలువురు నివాసం ఉంటున్నారు పందుల పెంపకం చేస్తున్నారు. అంతేకాకుండా వారికి మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవటంతో పిల్లలు భవన ఆవరణలో మలమూత్రాలు విసర్జిస్తున్నారు. ఇక సాయంత్రం అయితే మందుబాబులు కార్యాలయం ఎదుట మెట్లపై మద్యం సేవించి బాటిళ్లు, గ్లాసులు, భోజన పాకెట్లు కవర్లతో అపరిశుభ్రంగా మార్చేస్తున్నారు. కొందరు ఆకతాయిలు కార్యాలయ కిటికీల అద్దాలను పగులగొట్టేశారు. కార్యాలయపై భవనంలో కిటికీలు నిర్మించకుండా వదిలి వేశారు. కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో కార్యకర్తల సమావేశాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలోని కింది గదిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన బాలామృతం ప్యాకెట్లను అన్‌లోడ్ చేసి కేంద్రాలకు పంపిస్తుంటారు. రహదారి లేకపోవడం, ప్రాంగణం బురదమయం కావడం, సరుకు తెచ్చే లారీ డ్రైవర్లు వంతెనపై నిలిపివేయడంతో దింపుడు కూలీ అధికమవుతోంది. కార్యాలయం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉదహరిస్తూ ప్రాజెక్టు ఆఫీసర్లు, సిబ్బంది ఇటీవల ఫొటోలతో సహా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత ఇసుకపై గందరగోళం



కొల్లిపర కృష్ణానదిలో బాటవేస్తున్న పొక్లెయిన్



మున్నంగి రీచ్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న కూలీలు

కొల్లిపర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశం సామాన్యులకు ఏమో కాని అక్రమార్కులకు మాత్రం పంట పండుతోంది. ఉచితం ఇసుక అని ఆశపడిన వినియోగదారులకు నిరాశే మిగులుతోంది. ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి కొంతమంది అక్రమార్కులు గండి కొడుతున్నారు. ప్రభుత్వం అందరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అంతేకాకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీనరేజ్‌ని కూడా తీసివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇసుకాసురులకు సీనరేజ్ తీసివేయడంతో అది పెద్దవరంగా మారింది. ప్రభుత్వం నదీపరివాహక ప్రాంతాల్లో అనుకుని ఉన్న గ్రామాలకు మాత్రమే ట్రాక్టర్లకు, ఎడ్లబండ్లకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా కృష్ణానదిలో ఎక్కడిబడితే అక్కడ ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, కొల్లిపర, అన్నవరంలంక ఇసుకరీచ్‌ల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. దీంతో తెనాలి, గుంటూరు నుంచి ఇసుక కోసం వచ్చిన వాహనదారులను అధికారులు ఇసుక రీచ్‌ల్లోకి వెళ్ళకుండా అడ్డుకున్నారు. దీంతో ఇసుక వినియోగదారులకు అధికారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతుంటే ఒక ప్రక్క మీ రూల్స్ ఏమిటి.? మా వాహనాలు అపితే కుదరదూ అంటూ అధికారుల మాటలను ఖాతరు చేయకుండా ట్రాక్టర్లను ఇసుకరీచ్‌ల్లోకి తీసుకువెళ్లారు. కొల్లిపర మండలం అన్నవరం లంక సమీపంలో ఇసుక తవ్వేందుకు బాట వేయడానికి వచ్చిన పొక్లెయిన్‌ను గ్రామస్తులు కొద్దిసేపు అడ్డుకున్నారు.

సందట్లో సడేమియా అన్నట్లు ఇసుక కూలీలు లోడు ఖర్చులను రెట్టింపు చేశారు. గతంలో ట్రాక్టర్‌కు ఇసుకలోడు చేసినందుకు రూ.500లు తీసుకుంటుండగా ప్రస్తుతం డిమాండ్ చేస్తూ రూ.1000 నుంచి 1500లు వసూళ్లు చేస్తున్నారు. దీంతో సామాన్యులు చేసేది లేక కూలీలు అడిగిన డిమాండ్‌కు ఒప్పుకుంటూ ట్రాక్టర్లకు ఇసుకను లోడు చేయించుకుని తరలిస్తున్నారు. అయితే వాహనదారులు కూలీలకు అధికరేట్లు చెల్లించి వాహనాలకు ఇసుకను నింపుకుని గమ్యస్థానానికి చేర్చేటప్పటికి అధిక రేట్లు వసూళ్లు చేయడం గమనార్హం. గృహ వినియోగదారులు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పెట్టి పేదలకు మేలు చేసిందని అనుకుంటుంటే ఈ అధిక రేట్లు చూచి గగ్గోలు పెడుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికి రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఏమి చేయాలో అర్థంగాక .. సమస్యను చక్కదిద్దలేక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక అందించాలంటే రెవెన్యూ, పోలీసు అధికారులను ఇసుకరీచ్‌ల వద్ద నియమించి సక్రమంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కోతకు సిద్ధంగా వరి పైర్లు

దిగుబడులపై రైతుల ఆశలు



కోత కోయడానికి సిద్ధంగా ఉన్న వరి పంట

కొల్లిపర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో మాగాణి భూమిలో వేసిన వరిపైరు కోతకు సిద్ధమైంది. వారం పదిరోజుల్లో వరి కోతలు కోయడానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు. రైతులు ఆశలన్నీ దిగుబడులుపైనే పెట్టుకున్నారు. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో ఈ ప్రాంతంలోని రైతులు ముందస్తుగా వెదపద్ధతి ద్వారా వరి నాట్లు వేశారు. దీంతో కొంతమంది రైతులు వారం పది రోజుల్లో వరి కోతలను కోయటానికి సిద్ధపడుతున్నారు. వాతావరణం అనుకూలించి అంతా బాగుంటే ఎకరానికి 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడులు రావచ్చునని రైతులు ఆశిస్తున్నారు. రెండో పంటగా మొక్కజొన్న, జొన్న, పంటలను సాగు చేయటానికి రైతులు సిద్ధపడుతున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం వరి పంట వేసినందుకు ఎరువులు, పురుగు మందులు, కూలి రేట్లు విపరీతంగా పెరగటంతో వరి సాగుచేసినందుకు అధికంగా ఖర్చు అయినట్లు రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం వరి కోతలు సమయానికి బస్తా ధాన్యాన్ని 1400 రూపాయల నుంచి 1500 రూపాయల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం బస్తా పాత ధాన్యం ధర 2200 నుంచి 2300 రూపాయల వరకు ఉండటంతో వరిసాగు చేసిన రైతులు కొంత మేర ఉత్సాహంగా ఉన్నారు. నూర్పిడి చేసే సమయానికి ఈ ధర ఉండటంతో పాటు ధాన్యం దిగుబడులు ఆశించిన మేరకు ఉంటే కష్టానికి ప్రతిఫలం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. కొల్లిపర మండలంలో ఈ సంవత్సరం 6వేల 150 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేశారు.

మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర, గుదిబండివారి పాలెం, తూములూరు తదితర గ్రామాల్లో ముందస్తుగా వెద పద్ధతి ద్వారా సాగు చేసిన రైతులు వరి కోతకు సిద్ధమవటంతో యంత్రాల ద్వారా కోత కోయడానికి రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పాటుపడతాం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడతామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని జెడవల్లి గ్రామంలో ఆదివారం భీం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరేంద్రకుమార్ భూమి పూజచేసి సభలో మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల కోసమే ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ అహర్నిశలు పోరాడారన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బౌద్ధ సంఘం కన్వీనర్ వై అశోక్‌కుమార్, కూటమి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు పాటుపడాలి

సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని ఎమ్మెల్యే, నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మానవతా స్వచ్ఛంద సంస్థ పొన్నూరు శాఖ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడిగా బోడపాటి రామారావు, ఉపాధ్యక్షుడిగా లియాకత్, కార్యదర్శిగా నన్నపనేని బాలకృష్ణ, యరసాని వెంకటేశ్వర్లు, ఎన్వీ రమణ, వై విజయలక్ష్మి, పాములపాటి రవీంద్రనాద్, కొత్తమాసు రామకృష్ణ, షేక్ యాసిన్ బాబా, గోగినేని రాధాకృష్ణ, పావులూరి సాంబశివరావు, రామినేని కిషోర్ తదితరులు నియమితులయ్యారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎన్ రామచంద్రారెడ్డి, జిల్లా చైర్మన్ పావులూరి రమేష్ పాల్గొన్నారు.

కొసరాజుకు ఎమ్మెల్యే నివాళి

పొన్నూరుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘం నాయకులు కొసరాజు వెంకట్రాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం సజ్జా ఫంక్షన్ హాల్లో కొసరాజు వెంకట్రాయుడు సంస్మరణ సభ జరిగింది. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు వెంకట్రాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడు సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం, డీవీసీ హాస్పిటల్స్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, చల్లంశెట్టి సీతరామయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.



జడవల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర



మహేష్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి ఆలపాటి

పద్మశాలీయుల సంక్షేమానికి కృషి చేయాలి

- కార్పొరేషన్ డైరెక్టర్ సన్మాన సభలో మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీయుల సంక్షేమానికి కార్పొరేషన్ పాలకవర్గం కృషి చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సూచించారు. పద్మశాలీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జొన్నాదుల మహేష్ దంపతులను పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముత్తింశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పద్మశాలీయుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వ అరాచక విధానాలతో ఏ వర్గంకు మనశ్శాంతి లేదని, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులు సాధించేందుకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు తద్వారా ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పాలకవర్గం పని చేయాలన్నారు. సభలో కేవీ ప్రసాదరావు, వంగా సాంబిరెడ్డి, తాడిబోయిన హరిప్రసాద్, డాక్టర్ శేషగిరిరావు, అక్కల శ్రీరామ్, అన్నం పిన్నారావు, కేసన కోటేశ్వరరావు, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న 'హైందవ శంఖారావం'

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించే లోపు వాటి నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల నిమిత్తం ప్రభుత్వం ముందు డిమాండ్లను ఉంచేందుకు హైందవ శంఖారావం సభను నిర్వహించనున్ననట్లు ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య అన్నారు. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక టీజేపీఎస్ కళాశాలలో జరిగింది.

పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

గుంటూరు (విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బి పద్మకుమారి, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్నికల అధికారి ఎండీ హిదాయతుల్లా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వి వజ్రబాబు, ఉపాధ్యక్షుడిగా అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ ప్రభుప్రశాంత, ఉపాధ్యక్షుడిగా డి.రాంబాబు, ఎం రవీంద్రబాబు, కె ప్రసాద్‌బాబు, పీవీ కృష్ణ, పి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యదర్శి టీవీ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం అనిల్, కార్యదర్శులుగా కె మనోహర్, పి దుర్గాప్రసాద్, ఎ హరిసాయిరామ్, పి పవన్‌కుమార్, డి జార్జివిలియమ్ జీవీ జయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

లంపీ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ఏడీఏ డాక్టర్ నాగిరెడ్డి



తెనాలి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటి అయిన లంపీవైరస్‌పై పశుపోషకులందరూ అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రశ్న: లంపీవైరస్ అంటే ఏంటి?

జవాబు: ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి వాటిల్లో చర్మంపై దద్దుర్లు వ్యాపించి జ్వరం వంటి లక్షణాలతో మేతమేయకుండా అనారోగ్య సమస్యల బారిన పడటాన్ని లంపీ వైరస్ అంటారు. నోటివెంట, ముక్కుల వెంట నురగ కారుతుంటాయి. ఇది అంటువ్యాధి. సకాలంలో వైద్యం అందించకుంటే ప్రాణ నష్టం సభవించే అవకాశం ఉంది.



ప్ర: ఈ వ్యాధికి చికిత్స ఏ విధంగా అందిస్తారు.

జ: లంపీ వైరస్ సోకిన పశువులను వ్యాధి తీవ్రత లక్షణాలను బట్టి వైద్యం అందిస్తాం. ఇందుకు జ్వరం ఇతర సమస్యలకు యాంటీ బయోటిక్ కోర్సు వాడాల్సి ఉంటుంది. పూర్తిగా వ్యాధినయం అయ్యేందుకు సుమారు 30రోజుల వరకూ పట్టే అవకాశం ఉంది. వ్యాధి అదుపులోకి వచ్చినా వాటిచర్మంపై దద్దుర్లు, మచ్చలు ఉంటాయి.

ప్ర: ఈ వ్యాధి అంటువ్యాధా?

జ: ఈ వ్యాధి అంటువ్యాధిగానే పరిశోధనలో తేలింది. వ్యాధిసోకిన పశువులను ఈగలు లేదా దోమలు కుట్టి అవి వేరే పశువులను కుట్టడం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర పశువులకు సోకే ప్రమాదం ఉంది.

ప్ర: ఈ వ్యాధి రాకుండా ముందస్తు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయా?

జ: ప్రత్యేకంగా ఈ వ్యాధికి వ్యాక్సిన్ అంటూ ఏమీ లేదు. కాని గోట్‌ఫాక్స్ అనే వ్యాక్సిన్ దీనిబారిన పడకుండా కాపాడుతుంది. ప్రస్తుతం అవి పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇలా అన్ని జంతువులకు ఈ వ్యాక్సిన్ వేయించవచ్చు.



అత్తోటలో మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఒమేగా హాస్పటల్, డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ సిబ్బంది

మెడికల్ క్యాంపులతో వ్యాధులను గుర్తించవచ్చు

- డాక్టర్ జీవనలత

కొల్లిపర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ క్యాంపు ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తించటానికి అవకాశం ఉందని డాక్టర్ జీవనలత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అత్తోట, అత్తోటయాదవపాలెం గ్రామాల్లో రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఇంటర్‌క్లబ్ రిలేషన్ జోనల్ చైర్మన్ ఈదర వెంకటపూర్ణచంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవనలత మాట్లాడుతూ గ్రామాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేయడం వలన పేదప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం గుంటూరు ఒమేగా హాస్పటల్, తెనాలి డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్ హాస్పటల్ సిబ్బంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, దేవయజనం మురళీకృష్ణ, రోటరీక్లబ్ సభ్యులు గుత్తా వెంకటరత్నం, నల్లూరి వెంకటేశ్వరరావు కొత్తపల్లి వెంకటసుబ్బారావు, దేశబోయిన ప్రవిష తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు పతకాలు

తెనాలి అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు పతకాలు అందజేశారు. చెంచుపేటలోని కేఎస్‌ఎం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా ఆదివారం బాలురు, బాలికల విభాగంలో విజేతలకు మెడల్స్ అందజేశారు. బాలుర విభాగంలో జయసాయికృష్ణ 60 కిలోల విభాగంలో, క్లీన్ అండ్ జెర్క్‌లో 90కిలోలలో మొదటి స్థానం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు నాగశిరీష, రమేష్, రవికుమార్ పర్యవేక్షించగా, ఎస్.కోటేశ్వరరావు, గోపినాథ్, వెంకటరామిరెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నందివెలుగులో 100మందికి కంటి వైద్య పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమాదేవి తదితరులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందివెలుగు గ్రామం జాషువా నగర్‌లో ఆదివారం విజయబాబు మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని చదలవాడ స్కిన్ అండ్ ఐ కేర్ సెంటర్ డాక్టర్ చదలవాడ ఉమాదేవి ప్రారంభించి పేదలకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలో వృద్ధులలో వచ్చే కంటి సమస్యలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సుమారు 100మందికి కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన రోగులకు వైద్య సలహాలను, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలను నిర్వహించి కళ్ళ అద్దాలను, మందులను తమ వైద్యశాలలో అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ప్రసాదరావు, కె రాజేష్, అలీస్, విజయకుమార్, ప్రభుదాస్, ప్రసూనాంబ, ఐ కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలతో సీఎస్‌డీటీ భాస్కర్

130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు వాహనాల ద్వారా అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ కలెక్టర్ భార్గవతేజ నుంచి ఆదివారం అందిన ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు సీఎస్‌డీటీ బీ భాస్కర్ ఏటుకూరు బైపాసు రోడ్డులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు వాహనాలను ఆపి తనిఖీ చేయగా వాటిల్లో 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నల్లపాడు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి క్రిమినల్, 6ఏ కేసు నమోదు చేశారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ప్రకాశం బ్యారేజి దిగువకు 21 వేల 750 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 37 వేల 935 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 30 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 21 వేల 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 8 వేల 869 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 7 వేల 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 7726 క్యూసెక్కులు

దుగ్గిరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7726 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 14,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 306 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1526 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 710 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 410 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 3280 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

జన గణనతోపాటు కుల గణన చేపట్టాలి

మంగళగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలని అటల్ జననేత మైలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎస్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి, 70 శాతానికి పెంచాలని, చట్టసభల్లో 37 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఓబీసీకి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కుల గణన బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోదించాలని కోరారు. జాతీయ ఓబీసీ కమిషన్ జస్టిస్ రోహిణి ఆధ్వర్యంలో జన, కుల సర్వే చేపట్టి రాజ్యాంగబద్ధంగా అమలు చేయాలని, జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మంగళగిరి సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ తాడేపల్లి కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని కమిషనరు అలీమ్ బాషా తెలిపారు. డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఇతర విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరిస్తారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ప్రత్యేక కాల్ సెంటరు సెల్: 7093912653 నెంబరుకు ఫోను చేసి తెలియజేయాలని సూచించారు.

బూసిరెడ్డి, సాంబశివరావులకు నివాళి

తాడేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకులు ఉయ్యూరు బూసిరెడ్డి, ఈమని సాంబశివరావుల వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఉండవల్లిలోని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యాలయం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గసభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సీనియర్ నాయకులు ఈమని రామారావులు మాట్లాడుతూ బూసిరెడ్డి, సాంబశివరావులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఎం శ్రేణులు నిరంతరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టీ భక్తిరెడ్డి, ఎస్ ఇమ్మానుయేల్, కే జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌వీ రాఘవయ్య, వీ పార్థసారధి, శేషయ్య తదితరులు మాట్లాడారు.

భవన నిర్మాణానికి రూ.6లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను నగరానికి చెందిన డాక్టర్ యలమంచి మోహన్ కుమార్, తుమ్మల వినోదకుమారి, డాక్టర్ యలమంచి సురేంద్రకుమార్, వెలగపూడి రాధికారాణీ, బూడపాటి లక్ష్మీ విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌కు ఆదివారం చెక్కును దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆడపిల్లల విద్యకు కృషి చేస్తున్న కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమని అన్నారు. రమేష్ మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలగానే లాం చప్టా నిర్మాణం

- కొండవీటి వాగు పొంగితే రాకపోకలు బంద్
- ప్రమాదాల అంచున ప్రయాణాలు
- రెయిలింగ్ దెబ్బతిన్నా పట్టించుకోని అధికారులు
- రాత్రి వేళ్లలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తాడికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి ప్రధాన రహదారిలో ఉన్న లాం చప్టాకు మోక్షం లభించటం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా... అధికారులు మారుతున్నా... లాం చప్టాపై నూతన వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రస్తుత చప్టా స్థానంలో వంతెన నిర్మాణానికి అడుగులు ముందుకు పడటం లేదు. లాం వద్ద కొండవీటి వాగుపై వంతెన శిథిలావస్థకు చేరుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు రద్దీగా ఉండే గుంటూరు - అమరావతికి ప్రధాన రహదారి. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే ప్రమాదాల అంచున ప్రయాణం చేయాల్సిందే. కొండవీటి వాగు పొంగిపొర్లితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు ఉధృతిగా ప్రవహిస్తే ప్రవాహం తగ్గే వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో గుంటూరు నుంచి రాజధాని గ్రామా లకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పల్నాడు జిల్లా అమరావతి మండలం నుంచి గుంటూరుకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి ఉంది. చప్టాపై రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లేకపోలేదు. అదే లాం గ్రామం వద్ద ఉన్న లాం చప్టా. లాం వంతెన శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకునే వారే లేరు. వంతెనపై రెయిలింగ్ పూర్తిగా విరిగిపోయింది. రాత్రి సమయాల్లో చప్టాపై వాహనాలను జాగ్రత్తగా నడపాల్సి వస్తుంది. చప్టాపై రోడ్డు గుంతల మయంగా ఉంది. అయితే వర్షాలు కురిసినప్పుడు వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు కొండవీటి వాగు పొంగి వాగులో కొట్టుకొనిపోయి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. అందుకు గాను గత ప్రభుత్వాలు లాం చప్టాపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాయి గానీ కేవలం పేపర్లకే పరిమితం అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకసారి బిడ్జి నిర్మాణానికి ప్రణాళి కలు రూపొందించినా పట్టాలెక్కలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న తెనాలి శ్రావణ్‌కుమార్ అప్పటి సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీనికి సంబంధించి బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన కూడా చేశారు. నిధులు మంజూరైన ఆరు నెలలకు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఇందులో భాగంగా గోరంట్ల గ్రామంలోని హోసన్న మందిరం నుంచి 14వ మైలు వరకు నాలుగు వరసల రోడ్డును నిర్మించటానికి గత ప్రభుత్వం రూ.20 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు చేశారు. దాని తరువాత ఎన్నికలు రావటంతో చప్టా పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే శ్రీదేవి బ్రిడ్జి నిర్మాణాలు చేయటానికి ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయోజనం కలుగలేదు. లాం చప్టాపై బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల నాటి కల.. కలగానే నిలిచిపోతుంది. బ్రిడ్జి నిర్మాణం అటుంచితే దెబ్బతిన్న రెయిలింగ్‌ను ఏర్పాటు చేయటంతో పాటు, రోడ్డు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుకుంటున్నారు.



లాం చప్టాపై దెబ్బతిన్న రెయిలింగ్

తాడేపల్లిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఓపీ విభాగం ప్రారంభం



ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మద్దిపాటి సీతారా మ్మోహనరావు

తాడేపల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తాడేపల్లిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ అవుట్ పేషంట్ వైద్య విభాగం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించేందుకు తాడేపల్లి హైవేలో సర్వీస్ రోడ్డు వద్ద అవుట్‌పేషంట్ వైద్య విభాగాన్ని ప్రారంభించామన్నారు. ఈ సెంటర్లో ఫార్మసీ లేబరేటరీ, ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్‌మిల్ టెస్ట్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ టెలిమెడిసిన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, 5జీ టెక్నాలజీతో కూడిన ఐసీయూ ఆన్ వీల్స్ అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో అన్ని రకాల మాస్టర్ హెల్త్ చెకప్‌లు, స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌లు, ఇంటి వద్ద నుంచే లాబ్ శాంపిల్ సేకరణ, ఇంటివద్దకే మందులు అందించే సదుపాయం, ఉంటాయని తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం ఉచితంగా వైద్యనిపుణుల కన్సల్టేషన్ అందుబాటులో ఉంటుందని డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతారామ్మోహనరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై కార్తీక్ చౌదరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెండ్ల గిరిబాబు, యూనిట్ హెడ్స్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, డాక్టర్ సుమ, డాక్టర్ నితిన్, పురప్రముఖులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సంఘ నాయకుల పరామర్శ



కౌలు రైతులతో మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి హరిబాబు

తాడేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో కురిసిన అకాల వర్షాలు, వరదలకు ముంపుకు గురైన ఇంజన్‌ఆయిల్ మోటార్లు, మోటారు పంపు సెట్లను ఎన్యుమరేషన్ చేసి కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. ఆదివారం ఉదయం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు కౌలు రైతులను కలిసి వరద ముంపుపై పలు వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కృష్ణావరద ముంపులో భాగంగా చిర్రావూరులో లంక పొలాల్లో పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. పంటలతోపాటు వ్యవసాయ మోటార్లు పూర్తిగా నీటిలో మునిగిపోయి పాడయ్యాయన్నారు. వరదల్లో పంట ముంపునకు గురైన తరువాత రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తానని చెప్పిందని కొందరికి మాత్రమే నష్టపరిహారం అందిందని చెప్పారు. రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నవంబరు 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివ శంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, బొప్పన గోపాల రావు, మేడూరి పాములు, వరింశెట్టి శివనాగేశ్వరరావు, పి సుబ్బారావు, ధనేకుల వేణు, పోకల శంకర్, నారంశెట్టి శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా దుగ్గిరాల - ఈమని రహదారి

రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజల విజ్ఞప్తి



మరమ్మతులకు నోచుకోని దుగ్గిరాల-ఈమని రోడ్డు

దుగ్గిరాల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో గుంతలమయమైన రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. దుగ్గిరాల నుంచి ఈమని మీదుగా వల్లభాపురం, మున్నంగి గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమై కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. రోడ్డు కు ఇరువైపులా ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రోడ్లపై దృష్టి సారించలేదు. దీంతో వాహనం ఎదురుగా వస్తే తప్పుకునేందుకు వీల్లేకుండా ఉంది. ఈ పరిస్థితిలో పక్కనే ఉన్న పంట కాల్వల్లోకి వాహనాలు దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈమని వద్ద ఒకదశలో వర్షపు నీరు నిలిచిన రోడ్డుపై నాట్లువేసి గ్రామస్థులు నిరసన తెలియజేశారు. భారీగా ఇసుకలోడుతో వచ్చే లారీలు, టిప్పర్‌లతో గుంతలమయమైన రోడ్లు వాహనదారులకు నరకాన్ని చూపిస్తున్నాయి. రాత్రివేళల్లో ఈమని రోడ్డు గుండా ప్రయాణం ద్విచక్ర వాహనదారులకు దినదినగండంగా మారింది. అవసరమైన స్థాయిలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. గుంతలమయమైన రోడ్లతో ఆటోడ్రైవర్లు పలుమార్లు ప్రమాదాలకు గురికావడంతో రాత్రివేళల్లో తాము రాలేమని ఖరాఖండిగా చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు గానూ దుగ్గిరాల - ఈమని రోడ్డు పనులు త్వరగా చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ మల్లికార్జునరావు, వెనుక నిందితులు

గుంటూరు నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత నెల 31న దీపావళి నాడు బాణసంచా కాల్చే విషయంలో జరిగిన ఘర్షణలో ఓ దళిత కుటుంబంపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శకుంతలనగర్ రెండో లైన్‌కు చెందిన సెలబ్రేషన్స్ బార్ యజమాని కంకర నరేంద్రరెడ్డి, ఆయన కారు డ్రైవర్, పర్చూరుకు చెందిన వరగాని వెంకటేష్ అలియాస్ వెంకట్, అగతవరప్పాడులోని ఏపీఎస్ కాలనీకి చెందిన ఎల్లా సాయి ప్రకాష్, ఆరుదల శివయ్య ఉన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను హాజరుపరచి వివరాలు వెల్లడించారు. దీపావళి నాడు స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని శకుంతలనగర్ రెండో లైన్‌లోని జేసీ పారడైజ్-2 అపార్టు మెంట్‌కు చెందిన గుడిబండ్ల సోనియా, ఆమె కుమారుడు అవినాష్‌లు అపార్టుమెంట్ సెల్లార్‌లో బాణసంచా కాలుస్తున్నారు. అక్కడకు అవినాష్ స్నేహితుడు జయదేవ్ కూడా వచ్చారు. కొంచెం సేపటి తర్వాత సోనియా తన ఫ్లాట్‌లోకి వెళ్లగా అవినాష్, జయ దేవ్‌లు టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎదు రింట్లో పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న వర గాని వెంకటేష్ ఈ విషయమై అవినాష్, జయదేవ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో అవినాష్‌ను వెంకటేష్ కులం పేరుతో దూషించాడు. ఆ తర్వాత కూడా అవినాష్, జయదేవ్‌లు బాణసంచా కాలుస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేష్ నరేంద్రరెడ్డికి ఫోన్ చేయగా ఆయన అక్కడికి కారులో వచ్చి అవినాష్‌ను తొక్కించబోయాడు. ఆ తరువాత నరేంద్రరెడ్డితో పాటు ఆయన మామకు చెందిన ఓ లాడ్జిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న యల్లా సాయిప్రకాష్, ఆయారూ ముల్లో ఉండే ఆరుదల శివయ్యలు అవినాష్, జయ దేవ్‌లపై దాడి చేశారు. దీంతో, అపార్టుమెంట్ పైకి వెళ్లిన జయదేవ్ జరిగిన విషయాన్ని అవినాష్ తల్లి సోనియాకు చెప్పాడు. కిందకు వచ్చిన ఆమె, అవినాష్‌ను తీసుకొని పైకి వెళ్లింది. ఇంతలో అక్కడికి వచ్చిన నరేంద్రరెడ్డి కుమారుడు రుషికేశ్‌రెడ్డి, మహేష్ అలియాస్ నక్కా, డేవిడ్, రవితేజ, ఫయాజ్, వెంకట్, సాయి, శివ, షేక్ అనాస్, చిలకా రాము తది తరులు అందరూ కలిసి సోనియా ఫ్లాట్‌లోకి వెళ్లి సామగ్రిని ధ్వంసం చేశారు. అవినాష్‌పై దాడి చేసి వారు అతన్ని చంపేందుకు యత్నిస్తుండగా తల్లి సోనియా అడ్డుకుంది. ఆమెను అసభ్యకరంగా దూషించారు. దీంతో, డయల్ '100'కు అవినాష్ ఫోన్ చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చే సరికి నిందితులు పరారయ్యారు. గాయపడిన సోనియాను, ఆమె కుమారుడు అవినాష్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితురాలు సోనియా ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. అవినాష్‌పై దాడి చేసిన నిందితులు బార్ యజమాని కంకర నరేంద్రరెడ్డి, ఆయన డ్రైవర్ వరగాణి వెంకటేష్, ఎల్లా సాయి ప్రకాష్, ఆరుదల శివయ్యలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

క్రైమ్ జోన్

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

తాడికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొని మృతి చెందిన ఘటన లాం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడుముక్కల గ్రామానికి చెందిన షేక్ గౌస్(55) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గుంటూరు నుంచి రోజు కూరగాయలు తీసుకువచ్చి విక్రయిస్తుంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై కూరగాయలు తీసుకురావటానికి గుంటూరు బయలుదేరాడు. అమరావతి నుంచి గుంటూరు వైపు ఇసుక లోడ్‌తో ట్రాక్టర్ వెళ్తుంది. ఈక్రమంలో లాం గ్రామం వద్ద ట్రాక్టర్ డ్రైవర్ సడ్ బ్రేక్ వేయటంతో వెనుక వస్తున్న షేక్ గౌస్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు గౌస్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై కేసు

తాడికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై తాడికొండ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకొని భార్యను చిత్రహింసలు గురిచేయటంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే సురేష్‌బాబు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న క్రమంలో నిడుముక్కల, తాడికొండ గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య, పిల్లలను పట్టించుకోకుండా అదనపు కట్నం కోసం చిత్రహింసలు గురిచేసేవాడని తెలిపారు. విషయం బయటకు తెలియటంతో భార్య నిలదీసింది. దీంతో ఎవరి చెప్పుకుంటావో చెప్పుకో.. కేసు పెడితే మూడునెలలు సస్పెండ్ చేస్తారు... నా ఉద్యోగం నాకు తిరిగి వస్తుందని ఇష్టానుసారం మాట్లాడి కొట్టేవాడు. అంతేకాకుండా చంపుతానని బెదిరించేవాడని ఆమె ఫిర్యాదు చేసింది. కొన్ని నెలల క్రితం కానిస్టేబుల్ భార్య ఎస్సీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. అయితే సురేష్ బాబు భార్యకు మాయమాటలు చెప్పి నేను సరిగ్గా ఉంటానని చెప్పి కేసు వాపసు తీయించాడు. తనంతరం నెల రోజులు గడిచిన తరువాత తాడికొండకు చెందిన మహిళలతో సంబంధాన్ని కొనసాగించాడు. అదేమని అడిగితే నువ్వు ఏమి చేస్తావో.. చేసుకో... అని ఇష్టం వచ్చి మాట్లాడి, చిత్రహింసలకు గురిచేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ పవన్‌కుమార్

గుంటూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కలిగి ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని డాక్టర్ సీహెచ్ పవన్‌కుమార్ తెలిపారు. 'మెదడు, నరాలు సంబంధించిన వ్యాధులు' అనే అంశంపై స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ జరిగింది. పవన్‌కుమార్ మాట్లాడుతూ మన గుండెకు రక్తం సరఫరా చేసే నాళాల్లో బ్లాక్‌లు ఏర్పడినప్పుడు ఎలా గుండెపోటుకు దారి తీస్తుందో, మెదడుకు సంబంధించిన రక్తనాళాల్లో కూడా బ్లాక్‌లు ఏర్పడినా, రక్తనాళాలు చిట్లినా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తుందని వివరించారు. అకస్మాత్తుగా కంటి చూపు పోయినా, వినికిడి పోయినా, స్పర్శ పోయి మొద్దుబారిపోయినా, ఇవన్నీ బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా పేర్కొన్నారు.

అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా

మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్

ఫటా ఫట్



మంగళగిరి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలపరిధిలో అసాంఘీక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు సంబంధించి ఆయన పలు విషయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆ వివరాలు నేటి ఫటాఫట్‌లో..

ప్ర: శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: మండల పరిధిలో మొత్తం 68 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వారిలో కొందరు మృతి చెందగా, మరో 9 మంది జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వారినందరినీ పిలిపించి రూ.5 లక్షల వ్యక్తిగత పూచీకత్తుపై ఇటీవలే బైండోవర్ చేశాం. రౌడీషీటర్లకు తరచు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. గ్రామాలను సందర్శించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం.

ప్ర: చోరీల నియంత్రణపై దృష్టి సారించారా?

జ: గ్రామాల్లో దొంగతనాల ప్రభావం తగ్గింది. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి ఈ మధ్య కాలంలో రూ.45 లక్షల వరకు సొత్తు రికవరీ చేశాం. బంగారు ఆభరణాలు, బైకులను స్వాధీనం చేసుకున్నాం. పాత నేరస్తులను విచా రిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేశాం.

ప్ర: రాత్రుళ్లు గస్తీ ఎలా ఉంది?

జ: సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో పోలీసు బీట్లు వేయలేకపోతున్నాం. అయినప్పటికీ సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చట్ట వ్యతి రేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: గంజాయ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఇటీవల కాలంలో గంజాయి విక్రయాలు, రవాణా బాగా తగ్గింది. కాజ టోల్‌ప్లాజా మీదుగా గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుంది. అక్కడ తరచు వాహనాలను తనిఖీ చేస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ముంద స్తుగా వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకుంటున్నాం. వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించారా?

జ: ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్టాపర్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రిస్తున్నాం. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశాం. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

ఆపన్నులకు అండగా సీఎం సహాయ నిధి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఆపన్నులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ అన్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం స్థానిక టీడీపీ నేతలు పంపిణీ చేశారు. 29వ వార్డుకు చెందిన కమ్మెల పాములుకు రూ.లక్షా 80 వేలు, బ్యాంకు కాలనీకి చెందిన తోలేటి విజయభాస్కర్‌కు రూ.84,928, 12వ వార్డుకు చెందిన బత్తుల రాణికి రూ.67,646 చొప్పున అందజేశారు. తమకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం మంజూరు కావడానికి కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, నేతలు వల్లభనేని భార్గవ్, భైరబోయిన శివశంకర్, షేక్ ఖాదర్‌వలి, జనసేన మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ సుభానీ, షేక్ సమీరా, నాగయ్య, టీ అనురాగ్, వక్కలగడ్డ కిషోర్‌కుమార్, గొల్లపూడి సాయి, కాకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



కోసూరి చంద్రశేఖర్



రేఖా రామారావు

మంగళగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కోసూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా పాగోలు శ్రీనివాస రావు, కార్యదర్శిగా రేఖా రామారావు, సంయుక్త కార్యదర్శిగా రేఖా వీరరాఘవులు, కోశాధికారిగా వాకా కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులుగా యెనుమల మాధవరావు, కోసూరి రవికుమార్, ఉసిరికాయల ఆదిలక్ష్మి, పంది రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో గౌడ సంఘీయులు రేఖా సుధాకర్ గౌడ్, పాగోలు శ్యామ్, వాకా మంగారావు, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

గుంటూరు(విద్య), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మకుమారి, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్నికల అధికారి ఎండీ హిదాయతుల్లా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వీ వజ్రబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ ప్రభుప్రశాంత, ఉపాధ్యక్షులుగా డీ రాంబాబు, ఎం రవీంద్రబాబు, కే ప్రసాద్‌బాబు, పీవీ కృష్ణ, పీ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యదర్శి టీవీ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదరిగా ఎం అనిల్, కార్యదర్శులుగా కే మనోహర్, పీ దుర్గాప్రసాద్, ఏ హరిసాయిరామ్, పీ పవన్‌కుమార్, డీ జార్జీవిలియం, జీవీ జయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

సంస్థాగతంగా వైసీపీని బలోపేతం చేస్తాం

● దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జిల్లా, మండల, పట్టణ, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వైసీపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ముఖ్యనేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. వేమారెడ్డి మాట్లాడుతూ అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే కాకుండా వైసీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలు అధైర్య పడ వద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ మురుగుడు హను మంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్నెల్లకే ప్రజల్లో వ్యతిరేక భావన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నేతలు సంకె సునీత, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'మేఘదూతము' పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి కల్యాణ వేదికపై కొమాండూరు రామచంద్రాచార్యులు, కొమాండూరు రంగనాథచార్యులు ఆంధ్రానువాదం చేసిన 'మేఘదూతం' గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అమరావతి పబ్లికేషన్స్ నిర్వాహకులు వల్లూరి శివప్రసాదు గ్రంథావిష్కరణ గావించారు.